

ఉక్కుకు సొంత గనులు కేటాయిస్తేనే ప్రగతి



- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయిస్తే ప్రగతి పథంలో పయనిస్తుందని, అంతేగానీ కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ పేరుతో కార్మికులను మోసం చేస్తే ప్రగతి సాధించినట్టు కాదని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు.

-8లో

సూపర్‌బజార్‌లో ఇష్టారాజ్యం

మరమ్మతుల పేరిట నాలుగేళ్లలో రూ.60 లక్షల వ్యయం

- కంటింజెన్సీ పేరిట మరో రూ.55 లక్షలు
- ఆఫీసు నిర్వహణ ఖర్చులు రూ.35 లక్షలు
- బిల్లులు పెట్టుకొని డబ్బులు తీసుకోవడమే పని
- జీసీసీ డిపోలకు సరకులు సరఫరా చేసే ట్రేడర్స్‌కు నిబంధనలకు విరుద్ధంగా ముందస్తుగా చెల్లింపులు
- జాయింట్ కలెక్టర్‌కు చెప్పకుండానే ఆర్థిక వ్యవహారాలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్ (సూపర్ బజార్) అక్రమాల కేంద్రంగా మారింది. పాలకవర్గం లేకపోవడంతో మేనేజింగ్ డైరెక్టర్ ఇష్టానుసారం వ్యవహారాలు నడుస్తున్నాయి. జాయింట్ కలెక్టర్ పర్సన్ ఇన్‌చార్జిగా ఉన్నా ఆయన దృష్టికి ఏమీ తీసుకువెళ్లకుండానే ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత నాలుగేళ్లలో సుమారుగా రెండు కోట్ల రూపాయల దుర్వినియోగం అయ్యాయంటూ జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి.

ఏటా మరమ్మతులే

సూపర్‌బజార్ ప్రాంగణంలో షాపింగ్ మాల్‌తో పాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, కింద రెడీమేడ్ దుస్తుల షాపు, సూపర్ బజార్, ఫర్నీచర్ షాపు, చిన్న చిన్న షాపులు కొన్ని ఉన్నాయి. వీటిలో సూపర్ బజార్, చిన్న షాపులకు మాత్రమే మరమ్మతులు చేస్తుంటారు. ఇంకా నిర్వహణ ఖర్చులు ఉంటాయి. 2020కి ముందు నాలుగేళ్లలో ఈ ప్రాంగణం నిర్వహణ, మరమ్మతులకు సుమారు రూ.4.5 లక్షలు ఖర్చు కాగా, ఇప్పుడున్న మేనేజింగ్ డైరెక్టర్ వచ్చాక నిర్వహణ, మరమ్మతుల పేరుతో ఇప్పటివరకూ రూ.60,35,000 ఖర్చు చేసినట్టు బిల్లులు సృష్టించారు. ఈ నిధులతో కొత్తగా ఒక భవనమే నిర్మించవచ్చునని, అంతేసి మొత్తాల ఖర్చుకు పర్సన్ ఇన్‌చార్జి ఆమోదం కూడా లేదని జేసీకి పంపిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

కంటింజెన్సీ, ఆఫీస్ నిర్వహణ

సూపర్ బజార్ ఆఫీస్ నిర్వహణ, కంటింజెన్సీ (అత్యవసర/ఆకస్మిక) ఖర్చులకు కలిపి ఈ ఐదేళ్లలో రూ.91 లక్షలకు పైగా బిల్లులు పెట్టినట్టు సమాచారం. అందులో కంటింజెన్సీ ఖర్చులు రూ.55,75,000 కాగా నిర్వహణ వ్యయం రూ.35, 30,000గా చూపించారు. అంటే ఏడాదికి ఆఫీస్ నిర్వహణ కోసమే 18 లక్షల వరకూ ఖర్చు చేసినట్టు. అంటే నెలకు రూ.1.5 లక్షలు. పర్సన్ ఇన్‌చార్జి ఆఫీస్ నిర్వహణ కోసం కూడా ఇంత ఖర్చు ఉండదని సిబ్బంది గుసగుసలాడుతున్నారు.

సరకులు సరఫరా చేయకుండానే నిధులు

విశాఖ ఏజెన్సీలో జీసీసీ నిర్వహించే డిపోలకు కిరాణా సరకులను సూపర్ బజారు సరఫరా చేస్తుంది. ఆ బాధ్యత ట్రేడర్లకు అప్పగిస్తుంది. వారు సరకులు సరఫరా చేశాక, ఆ మొత్తం డిపోల నుంచి సూపర్ బజారుకు జమ అయ్యాక, తన కమీషన్ మినహాయించుకుని మిగిలిన మొత్తం ట్రేడర్లకు ఎండీ అందజేస్తారు. ఇది అమలులో ఉన్న విధానం. ఇలా ఈ సరకులు రవాణా కోసం ఆస్కార్ ఎంటర్‌ప్రైజెస్, పీవీఆర్ ట్రేడర్స్‌కు బాధ్యతలు అప్పగించారు. వీరు డిపోలకు అందించిన సరకులకు సంబంధించిన నగదు ఏజెన్సీ నుంచి సూపర్‌బజార్ ఖాతాకు జమ కాక ముందే... సుమారు రూ.65 లక్షల వరకు ఆ రెండు సంస్థలకు విడుదల చేశారనే అభియోగం ఉంది. ఇది పూర్తిగా నిబంధనలకు విరుద్ధం. ఆ ట్రేడర్లతో ఉన్న లోపాయికారీ అవగాహన వల్లే ఇలా చేశారని, ఇప్పుడు కొద్దికొద్దిగా ఆ మొత్తాలను తెచ్చి కడుతున్నారని జేసీకి పంపిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇలా ఈ ఐదేళ్లలో సుమారు రూ.2.17 కోట్లు దుర్వినియోగం జరిగిందని, ఎండీని పోస్టు నుంచి తప్పించి, పూర్తిస్థాయి విచారణ నిర్వహించి,తగిన చర్యలు తీసుకోవాలని వారంతా డిమాండ్ చేస్తున్నారు.

జీవనం భారమై, పిల్లలకు దూరమై...

అందరూ ఉండి అనాథలుగా వృద్ధులు

- ఆర్థిక, ఆరోగ్యపరమైన ఇబ్బందులతో సతమతం
- గుప్పెడు మెతుకులు, ప్రేమ పూర్వక మాట కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి
- పట్టించుకోని చాలామంది పిల్లలు
- ఆస్తులు పంచుకుని, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు చేరుస్తున్న వైనం...
- విద్యావంతుల్లోనే అధికం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగర పరిధిలోని ఎంవీపీ కాలనీ వాసి (73) ఒకరు ప్రభుత్వ శాఖలో పనిచేసి పదవీ విరమణ చేశారు. రిటైర్‌మెంట్ సమయంలో వచ్చిన డబ్బును పిల్లలిద్దరికీ సమానంగా పంచారు. ఆ తరువాత ఆయన కొన్నాళ్లపాటు మరోచోట పనిచేశారు. పదేళ్ల కిందట ఆయన భార్య కన్నుమూశారు. ప్రస్తుతం ఒంటరిగా ఉంటున్నారు. ఈ మధ్య ఆరోగ్యం బాగుండడం లేదని నగరంలోనే నివాసం ఉంటున్న పిల్లలకు సమాచారం ఇస్తే బిజీగా ఉన్నామంటూ సమాధానం వచ్చింది. దీంతో స్నేహితుడి సహకారంతో ఆయన ఆస్పత్రిలో చేరాల్సి వచ్చింది.

గాజువాక ప్రాంత వాసి (ప్రస్తుతం 68 ఏళ్లు)కి ముగ్గురు పిల్లలు. ముగ్గురినీ బాగా చదివించారు. ఆస్తిపాస్తులు కూడా బాగానే ఇచ్చారు. వృద్ధాప్యంలో భార్యను కోల్పోయిన ఆయన్ను...పిల్లలు ఎవరూ చేరదీయలేదు. ఒంటరితనంతో ఇబ్బందులు పడలేక ఆయన బంధువుల సహాయంతో వృద్ధాశ్రమంలో చేరిపోయారు.

...ఇటీవల ఈ తరహా ఉదంతాలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. బయటకు వస్తున్నవి కొన్ని మాత్రమే. రానివి ఎన్నో ఉంటున్నాయి. పిల్లల కోసం జీవితాలను త్యాగం చేసిన తమను చివరి దశలో వారు నిర్లక్ష్యం చేయడాన్ని తల్లిదండ్రులు తట్టుకోలేకపోతున్నారు. క్షణమొక యుగంలా గడుపుతూ తీవ్ర మానసిక వేదనను అనుభవిస్తున్నారు. పిల్లల ప్రైవసీకి ఇబ్బంది కలగకూడదన్న ఉద్దేశంతో ముందు నుంచీ తల్లిదండ్రులు దూరంగా ఉంటుంటారు. అదే వారిపాలిట శాపంగా మారుతోంది. వయసు పైబడి, అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్నా పిల్లలు పట్టించుకోవడం లేదు.

వృద్ధాశ్రమాలకు తాకిడి..

ఎవరూ లేని వారి కంటే అందరూ ఉండి కూడా అనాథలుగా మారుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. గతంలో వృద్ధాశ్రమాల్లో ఉండే వారి సంఖ్య తక్కువగా ఉండేది. ఇప్పుడు పెరుగుతోంది. ప్రేమ సమాజంతోపాటు జిల్లాలో అనేక సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాల్లో వందలాది మంది ఉంటున్నారు. వారిలో ఎవరిని కదిలించినా... అందరూ ఉన్న అనాథలం తామంటూ కన్నీటి పర్యంతమయ్యేవారు ఎందరో ఉన్నారు. బిడ్డల కోసం రెక్కలు కష్టం చేసిన ఎంతోమంది...చివరి దశలో గుప్పెడు మెతుకులు కోసం, ప్రేమ పూర్వక పిలుపు కోసం ఆశగా ఎదురు చూడాల్సిన స్థితిలో ఉన్నారు.

విద్యావంతుల్లోనే అధికం

తల్లిదండ్రులను దూరం పెడుతున్న వారిలో విద్యావంతులు, ఉన్నత కుటుంబాలకు చెందినవారే ఎక్కువగా ఉండడం గమనార్హం. వయసు పైబడిన తల్లిదండ్రులను చూసుకోవడం ఇబ్బందిగా భావించడమే కాదు. ..వారితో మాట్లాడేందుకు కూడా కొందరు ఇష్టపడడం లేదు. మద్దిలపాలెం ప్రాంతానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి ఒకరు గడిచిన రెండేళ్లుగా కుమార్తె ఇంట్లో ఉంటున్నారు. సమయానికి భోజనం పెట్టామా?, లేదా?..అన్నట్టు మాత్రమే కుటుంబ సభ్యులు ఉంటున్నారు. ప్రేమగా మాట్లాడే పరిస్థితి లేకపోవడంతో వారికి ఇబ్బందిగా ఉండకూడదని భావించిన ఆయన ఇంట్లో చెప్పకుండానే కొద్దిరోజుల కిందట వృద్ధాశ్రమంలో చేరిపోయారు. ప్రేమ లేని చోట కడుపు నింపుకోవడానికి మాత్రమే ఎందుకు ఉండాలన్న ఉద్దేశంతోనే ఆశ్రమానికి వచ్చేశానంటూ తన స్నేహితుడికి చెప్పి

... మిగతా 6వ పేజీలో

రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

జిల్లాలో 134 కేంద్రాలు	29,927 మంది విద్యార్థులు	రెగ్యులర్ 28,523 మంది

- ఆరు కేంద్రాల్లో సీసీ కెమెరాలు
- పరీక్ష ప్రారంభమైన అరగంట వరకూ పరీక్షా హాలులోకి అనుమతి
- ...అయితే ప్రతిరోజూ ఆలస్యంగా వెళితే మాత్రం ప్రవేశం ఉండదు
- ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్లు నిషేధం
- 15 కేంద్రాల్లో ఓపెన్ స్కూలు పరీక్షలకు 938 మంది
- విశాఖ సెంట్రల్ జైలులో 30 మంది ఖైదీలకు కేంద్రం ఏర్పాటు
- జిల్లా విద్యాశాఖాధికారి నిమ్మక ప్రేమ్‌కుమార్



విశాఖపట్నం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి):

పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని, అందుకు తగిన ఏర్పాట్లు చేశామని జిల్లా విద్యాశాఖాధికారి నిమ్మక ప్రేమ్ కుమార్ తెలిపారు. శనివారం తన ఛాంబర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ/ఏప్రిల్ ఒకటో తేదీ (రంజాన్ 31వ తేదీన జరిగితే) వరకూ జరిగే పరీక్షలకు 29,927 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. వీరిలో 28,523 మంది రెగ్యులర్, 1,404 మంది ప్రైవేటు విద్యార్థులు ఉన్నారన్నారు. రెగ్యులర్ విద్యార్థులలో బాలురు 15,094 మంది, బాలికలు 13,429 మంది ఉన్నారన్నారు. ఒకేషనల్ ట్రేడ్‌లో 2,124 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణకు పరీక్షలకు జిల్లాలో మొత్తం 134 కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు.

ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని మాస్ కాపీయింగ్‌ను నిరోధించడానికి శొంఠ్యాం, గంగవరం, ఇస్లాంపేట, నరవ, అగనంపూడి, రెడ్డిపల్లి కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ ఆఫీసర్‌ను నియమించామన్నారు. 1,472 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహిస్తారని డీఈవో తెలిపారు. పరీక్ష

... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.10 (ఆదివారం సాయంత్రం)

సహర్ : 4.47 (సోమవారం ఉదయం)

పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై కసరత్తు

జీవో 117 రద్దు అనంతరం ఐదు రకాల పాఠశాలల నిర్వహణకు ప్రతిపాదన

- ప్రతి పంచాయతీలో ఒక ఆదర్శ పాఠశాల
- పిల్లల రవాణా వ్యయం భరించనున్న ప్రభుత్వం
- పది మంది కంటే తక్కువ విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలు ఎత్తివేత?
- తల్లిదండ్రుల కమిటీల నుంచి వ్యతిరేకత
- తల్లిదండ్రులను ఒప్పించే బాధ్యత ఎమ్మెల్యేలు, కలెక్టర్‌కు అప్పగింత

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవో 117 రద్దు నేపథ్యంలో పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై విద్యా శాఖ తర్జనభర్జన పడుతోంది. వైసీపీ పాలనలో ప్రాథమిక విద్య వెన్ను విరిచిన జీవో 117ను రద్దు చేసిన ప్రస్తుత ప్రభుత్వం ఉన్నత స్థాయిలో రూపొందించిన విధానాల ప్రకారం ఐదు రకాల బడులను తెరపైకి తీసుకువచ్చింది. దీని ప్రకారం ఉన్నత పాఠశాలల్లో కొనసాగుతున్న 3,4,5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు తీసుకువస్తున్నారు. అలాగే ప్రతి పంచాయతీలో ఒక ఆదర్శ పాఠశాలను ఏర్పాటుచేస్తారు. ఆ ఆదర్శ పాఠశాలకు మిగిలిన గ్రామాల నుంచి వచ్చే పిల్లలకు రవాణా ఖర్చులు ప్రభుత్వం చెల్లిస్తుంది. ఈ విధానంలో ఆదర్శ పాఠశాల విషయంలో తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.

నూతన విధానంలో పది మంది పిల్లల కంటే తక్కువగా ఉన్న ప్రాథమిక పాఠశాలల కొనసాగింపుపై విద్యా శాఖ గోప్యత పాటించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అటువంటి ప్రాథమిక పాఠశాలలు మూతపడడం అనివార్యంలా కనిపిస్తోంది. అక్కడ అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య (ఎల్‌కేజీ, యూకేజీ) మాత్రమే బోధిస్తారని టీచర్లు



చెబుతున్నారు. పది మంది కంటే తక్కువ ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలను సమీప గ్రామంలోని ప్రాథమిక

... మిగతా 6వ పేజీలో

ప్రతిపాదనలు ఇవే...

పాఠశాలల పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం శాటిలైట్ ఫౌండేషన్, ఫౌండేషన్, బేసిక్ ప్రాథమిక పాఠశాల, ఆదర్శ ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలు అమలులోకి వస్తాయి.

1. శాటిలైట్ ఫౌండేషన్ పాఠశాలలు: స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలు. వీటిలో పూర్వ ప్రాథమిక విద్య (పీపీ-1, 2.. (ఎల్‌కేజీ, యూకేజీ(బోధిస్తున్నారు. అదే జరిగితే ఆయా గ్రామాల్లో ఉన్న ప్రాథమిక పాఠశాలల భవిష్యత్తు ప్రశ్నార్థకం. కేవలం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పూర్వ ప్రాథమిక విద్య అందించి అనంతరం ఆయా గ్రామాల్లో పిల్లలను సమీపంలో పాఠశాలలకు పంపుతారు.

2. ఫౌండేషన్ పాఠశాలలు: పీపీ-1, పీపీ-2, ఒకటి, రెండో తరగతి వరకు మాత్రమే బోధన చేస్తారు. అటువంటి గ్రామాల్లో 3,4,5 తరగతుల విద్యార్థులు సమీపంలో ఉన్న పాఠశాలలకు వెళ్లాల్సి ఉంటుంది.

3. బేసిక్ ప్రాథమిక పాఠశాలలు: పీపీ-1,2తో పాటు ఒకటి నుంచి ఐదు తరగతులు ఉంటాయి. విద్యా హక్కు చట్టం ప్రకారం విద్యార్థుల

... మిగతా 6వ పేజీలో

చర్లపల్లి మీదుగా రైళ్ల రాకపోకలు

- ఇకపై ఎల్‌టీటీ, నాందేడ్, షిర్డీ ఎక్స్‌ప్రెస్‌లు సికింద్రాబాద్ వెళ్లవు

విశాఖపట్నం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి):



చర్లపల్లి స్టేషన్ మీదుగా రాకపోకలు సాగించేలా పలు రైళ్లను శాశ్వత ప్రాతిపదికన దారిమళ్లిస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఏప్రిల్ 22 నుంచి లోకమాన్య తిలక్ టెర్మినస్-విశాఖ ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18520), 24 నుంచి విశాఖ-లోకమాన్య తిలక్ టెర్మినస్ ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (08519) రైళ్లు చర్లపల్లి, అమ్ముగుడ, సనత్‌నగర్ మీదుగా రాకపోకలు సాగిస్తాయి. ఈ రైళ్లు మౌలాలి, సికింద్రాబాద్ స్టేషన్లకు వెళ్లవు. అలాగే ఏప్రిల్ 24 నుంచి విశాఖ-సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ (18503), 25 నుంచి సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ (18504), సంబల్‌పూర్-నాందేడ్ ఎక్స్‌ప్రెస్ (20809), 26 నుంచి నాందేడ్-సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (20810), విశాఖ-నాందేడ్ ఎక్స్‌ప్రెస్ (20811), 27 నుంచి నాందేడ్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (20812) రైళ్లు చర్లపల్లి, మౌలాలి జి క్యాబిన్, దయానందనగర్ మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

ప్లాస్టిక్ రహిత నగరంగా విశాఖ



'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం ఆర్కే బీచ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జిల్లా ప్రత్యేకాధికారి సీనియర్ ఐఏఎస్ అధికారి కాటంనేని భాస్కర్, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ అదనపు కమిషనర్లు సోమన్నారాయణ, వర్మ, రమణమూర్తి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేష్, జోనల్ కమిషనర్లు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విశాఖ నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ప్రజలు స్వచ్ఛందంగా సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. స్వచ్ఛమైన గాలి, వాతావరణం కావాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

- 8వ పేజీలో

అర్హులకు పింఛన్ల మంజూరులో జాప్యం

- జడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో సభ్యుల ఆందోళన
- పక్కా ఇళ్లు మంజూరు చేయాలని వినతి
- కేజీహెచ్ మార్చురీలో పోస్టుమార్టం ఆలస్యం అవుతోందన్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



మహారాణిపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి):

సామాజిక పింఛన్ల మంజూరులో జాప్యంపై పలువురు జడ్పీటీసీ సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు. చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన శనివారం జడ్పీ సమావేశ మందిరంలో ఒకటి నుంచి ఏడు వరకు స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగా పింఛన్లు ఎందుకు మంజూరుచేయడం లేదన్న సభ్యుల ప్రశ్నకు డీఆర్‌డీఏ అధికారులు

... మిగతా 6వ పేజీలో

ఉత్సాహంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

» సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించిన అధికారులు » పలు చోట్ల విద్యార్థులతో అవగాహన ర్యాలీలు » పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని పిలుపు



గిడిజాలలో కాలువలు శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, యువనేత రవితేజ

ఆనందపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 26 పంచాయితీల్లో స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. గిడిజాల పంచాయతీ పరిధిలోని దిబ్బడిపాలెంలో జరిగిన కార్యక్రమంలో భీమిలి శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు పాల్గొని ప్రజలతో కలసి కాలువలను శుభ్రం చేశారు. చీపుళ్లతో వీధులను తుడిచారు. అలాగే జలజీవన్ మిషన్ నిధులతో ఏర్పాటు చేసిన 30 కిలోలీటర్ల ఓవర్ హెడ్ ట్యాంక్ ద్వారా ఇంటింటి కొళాయిలకు నీటి సరఫరాను ప్రారంభించారు. అలాగే సామాజిక ఇంకుడుగుంత ఏర్పాటుకు శంకుస్థాపన చేసి మొక్కలు నాటారు. గ్రామంలోని హరిత రాయబారులను సన్మానించి వారికి బియ్యాన్ని అందించారు. కార్యక్రమంలో టీడీపీ యువనేత గంటా రవితేజ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు గండ్రెడ్డి స్వామినాయుడు, ఘట్టమనేని సుభాశ్‌చంద్రబోస్, బీఆర్బీ నాయుడు, గండ్రెడ్డి రమేష్, టి.అప్పారావు, మీసాల సత్యనారాయణ,కోరాడవైకుంఠరావు, వివిధశాఖల అధికారులుపాల్గొన్నారు.

భీమునిపట్నంలో..

భీమునిపట్నం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మూడో శనివారం జీవీఎంసీ భీమిలి జోన్-3 వార్డు గంటస్తంభం, 4వ వార్డు చేపలుప్పాడ గ్రామంలోను స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో జడ్పీ ప్రసన్నవాణి పాల్గొని పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణం, మానవాళి మనుగడకు కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అందువల్ల ప్లాస్టిక్ సంచుల స్థానంలో గోనే లేదా గుడ్డ సంచులు వినియోగించాలని సూచించారు. అనంతరం ప్రజలతో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నాయకులు గంటా నూకరాజు, శానిటేషన్ సెక్రటరీ రామశర్మ, సూపర్‌వైజర్ రేగాని రవి, మహిళా పొదుపు సంఘాలసభ్యులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

కంచేరుపాలెంలో డీవీస్ ఉద్యోగుల స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ

భీమునిపట్నం (రూరల్) మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మండలం కంచేరుపాలెంలో చిప్పాడ దివీస్ ఉద్యోగులు శనివారం సామూహికంగా స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ నిర్వహించారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ రేఖ కరుణ ఈసీడీ విభాగం జనరల్ మేనేజరు బాలాజీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దివీస్‌లోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న 200 మంది అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతిరోజూ కొంత సమయం కేటాయించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని నినదించారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజరు ప్రసాద్, సంక్షేమ అధికారి విజయభాస్కర్, ఇతర దివీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తాటితూరులో స్వర్ణాంధ్ర ర్యాలీ

భీమునిపట్నం (రూరల్) మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : అందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని అవగాహన కలిస్తూ భీమిలి మండలం తాటితూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు సన్యాసినాయుడు అధ్యక్షత వహించారు. ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా మండలంలో తాళ్లవలస, దాకమర్రి, అమనాం తదితర గ్రామాల్లో సైతం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీలు నిర్వహించి అవగాహన కలిగించారు.



భీమునిపట్నం (రూరల్) : మండలంలోని కంచేరుపాలెంలో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న దివీస్ ఉద్యోగులు

తగరపువలసలో స్వచ్ఛ ప్రతిజ్ఞలు

తగరపువలస, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోనల్ అధికారుల ఆధ్వర్యంలో శనివారం తగరపువలస అంబేడ్కర్ కూడలి, మార్కెట్ కూడలి వద్ద పలువురితో స్వచ్ఛ ప్రతిజ్ఞలు చేయించారు. ఒకసారి ఉపయోగించి పడ వేసే ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి ఎదురవుతున్న ఇబ్బందులను అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో జోనల్ కార్యాలయ సిబ్బందితో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.



భీమునిపట్నం మండలంలోని తాటితూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



భీమునిపట్నంలోని గంటస్తంభం వద్ద స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం

సీఐగా తిరుమలరావు బాధ్యతల స్వీకారం



భీమునిపట్నం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : భీమిలి పోలీసు స్టేషన్ లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్‌గా బి.తిరుమలరావు శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన బి.సుధాకర్‌రావును నగర పోలీసు కమిషనరు వీఆర్‌కు సరండర్ చేసిన విషయం తెలిసిందే. కాగా, నగరంలోని పలు స్టేషన్లలో పని చేసిన తిరుమలరావు ఇక్కడకు టు టౌన్ పోలీసు స్టేషన్ నుంచి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమిలి స్టేషన్

'ముత్తంశెట్టి' క్యాంప్ ఆఫీసుకు రంగులు

» వైసీసీని వీడిన మూడు నెలల తర్వాత ...
» భీమిని నియోజకవర్గంలో ఆసక్తికర రాజకీయ చర్చ

భీమునిపట్నం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు చెందిన భీమిలిలో ఉన్న క్యాంప్ కార్యాలయానికి కొత్తగా రంగులు వేశారు. ఇటీవల వరకూ ఈ క్యాంప్ ఆఫీసులో నియోజకవర్గ వైసీపీ కార్యాలయాన్ని నిర్వహించేవారు. ఈ కారణంగా ఆ పార్టీ రంగులు ఉండేవి. అయితే, మూడు నెలల క్రితం ముత్తంశెట్టి వైసీపీకి రాజీనామా చేశారు. వెంటనే కార్యాలయానికి ఏర్పాటు చేసిన వైసీపీ ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించినా, భవనానికి మాత్రం వైసీపీ రంగులు అలానే ఉంచేశారు. ఈ నేపథ్యంలో.. శుక్రవారం నాడు ఆ వైసీపీ రంగులను కూడా చెరిపేస్తూ ముందు వైట్ కలర్ వేశారు. యాదృచ్ఛికంగా అదే రోజు పిఠాపురంలో జనసేన ఆవిర్భావ దినోత్సవం భారీ ఎత్తున జరుగుతుండడంతో రాజకీయవర్గాల్లో ఈ భవనానికి ఏ పార్టీకి చెందిన కొత్త రంగు పడుతుందోనని పలువురు చర్చించుకుంటున్నారు. అయితే, కొందరు జనసేన అంటే.. మరికొందరు బీజేపీలో ముత్తంశెట్టి చేరుతారని అంటున్నారు. అయితే, అవంతి యూనివర్శిటీ సాధించేవరకూ ముత్తంశెట్టి ఏ పార్టీలోనూ చేరరని ఇంకొందరు అనుకుంటున్నారు. 2026లో అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరగబోతున్న నేపథ్యంలోలో ఆయన ఏ అడుగు వేస్తారా? అన్న ఆసక్తికరంగా మారింది.



కొత్త రంగులతో 'ముత్తంశెట్టి' ఆఫీసుకు వేసిన

వినోదాత్మకంగా అనంత పద్మనాభుని పుష్పయాగం

పద్మనాభం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అనంతపద్మనాభుని శ్రీపుష్పయాగంతో స్వామివారి కల్యాణోత్సవాలు శనివారం రాత్రి ఘనంగా ముగిశాయి. తన ఉంగరం పోయిందని స్వామి వారు పల్లకీపై తిరువీధులలో వెతకడానికి వెళ్లే వినోద ఘట్టాన్ని ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరిని తాళ్లతో బంధించి ఉంగరం కోసం విచారించిన విధానం భక్తులకు వినోదాన్ని పంచింది. రాత్రి ఉభయ దేవేరులతో కూడిన అనంతుడిని ప్రత్యేక వేదికపై నిలిపారు. ఆలయ అర్చకులు పి.సీతారామాంజనేయ స్వామి ఆధ్వర్యంలో వేదపండితులు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత అనంత పద్మనాభస్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకీపై నిలిపి ఆలయం చుట్టూ 12సార్లు భక్తుల గోవింద నామస్మరణ, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణలతో ఊరేగించి పూజలు నిర్వహించారు.



పద్మనాభస్వామి కల్యాణోత్సవాల ముగింపు వేడుక

అనంతరం ఉత్సవ విగ్రహాలను వేదికపై నిలిపి చతుర్వేద పారాయణ చేసి, పలు రకాల ఫల, పుష్పాలతో స్వామివారికి పుష్పాంజలి కార్యక్రమం కన్నుల పండువగా చేపట్టారు. స్వామివారికి పవళింపు సేవతో కార్యక్రమం వైభవంగా ముగిసింది. దేవస్థానం ఈఓ ఎస్.నానాజీబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఎర్నాయుడు, సన్యాసిరావు, పైడిరాజు, పద్దు, నర్సింగరావు పాల్గొన్నారు.

రమణీయంగా ముగిసిన రాములోరి కల్యాణోత్సవాలు

సింహాచలం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయబద్ధంగా జరిగిన శ్రీపుష్పయాగంతో శ్రీసీతారాముల వార్షిక తిరుకల్యాణోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. శనివారం రాత్రి హనుమ లక్ష్మణ, సీతారాముల ఉత్సవమూర్తులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై ఉంచారు. ఆలయ వైదికులు ఆగమోక్తంగా షోడశోపచారాల పూజలు జరిపారు. అనంతరం చామంతి, గులాబి, మల్లె తదితర పరిమళ భరిత పుష్పాలతో సీతారాములను అభిషేకించారు. మంగళ నీరాజనాలిచ్చి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.



సీతారాములుకు పూజలు చేస్తున్న అర్చకులు

వైభవంగా అప్పన్న తిరువీధి

మీన సంక్రమణ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం సింహాద్రినాథుని తిరువీధి వైభవంగా నిర్వహించారు. ప్రతిమాసంలో వచ్చే సంక్రమణం రోజున తిరువీధి జరపటం ఆచారంగా వస్తోంది. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఆసీనులను చేశారు. ఆలయ విద్వాంసుల నాదస్వరాలాపన, పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ మాడవీధుల్లో తిరువీధి ఉత్సవాన్ని వైభవంగా జరిపారు. మార్గం పొడవునా ఫలహారాలు, కర్పూర నీరాజనాలిచ్చి స్వామికి భక్తులు ఆహ్వానం పలికారు.

సముద్రంలోకి ఆలివ్‌రిడ్లీ పిల్లలు



పిల్లలను విడిచిపెడుతున్న అధికారిణి శ్రీవాణి

సాగర్‌నగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సాగర్‌నగర్ సంరక్షణ కేంద్రం నుంచి శనివారం ఉదయం జిల్లా అటవీశాఖ అధికారిణి శ్రీవాణి ఆధ్వర్యంలో ఆలివ్‌రిడ్లీ పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బుడి బుడి అడుగులు వేసుకుంటూ పిల్లలు సముద్రంలోకి చేరుకున్న తీరును సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. అధికారిణి శ్రీవాణి మాట్లాడుతూ జోడుగుళ్లపాలెం, చేపలుప్పాడ, పెదనాగమయపాలెం ప్రాంతాల్లో 57,372 గుడ్లను సేకరించి సాగర్‌నగర్ బీచ్‌లో సంరక్షించామన్నారు. తొలి ప్రయత్నంగా 237 పిల్లలను సముద్రంలో విడిచిపెట్టామన్నారు. ప్రతిరోజు ఈ పిల్లలను సముద్రంలో విడిచిపెడతామన్నారు.అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చట్ట పరిజ్ఞానంపై సదస్సు నేడు

పద్మనాభం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మద్ది గ్రామంలో 16న ఆదివారం ఉదయం 9 గంటలకు చట్ట పరిజ్ఞానంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పద్మనాభం సీఐ సీహెచ్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. భీమిలి మేజిస్ట్రేట్ సౌజన్య, ఏసీపీ అప్పలరాజు పాల్గొంటారన్నారు.

ప్రజల రుణం తీర్చుకుంటా: గంటా



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, స్థానిక నాయకులు

కొమ్మాది, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమం తమ ప్రభుత్వానికి రెండు కళ్లు అని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఆరో వార్డులో రూ.3.62 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. వైసీపీ హయాంలో పట్టించుకోని అభివృద్ధిని తాము పరుగులు పెట్టిస్తున్నామని అన్నారు. మధురవాడకు మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భీమిలి నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానని తెలిపారు. త్వరలో వైసీపీ మొత్తం ఖాళీ అవుతుందని, జగన్మోహనరెడ్డి ఏకాకిగా మిగలటం ఖాయమని అన్నారు. కార్పొరేటర్ మొల్లి హేమలత, టీడీపీ నాయకులు దాసరి శ్రీనివాస్, మొల్లి లక్ష్మణరావు, మన్యాల సోంబాబు, బోయిశ్రీను, రెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచుకుంటే ఉపాధికి భరోసా

సాగర్‌నగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చునని కోడ్‌ఫాస్ట్ ప్రాజెక్టు మేనేజర్ అమర్ కోటిపల్లి తెలిపారు. శనివారం రుషికొండ గాయత్రీ విద్యాపరిషత్ కళాశాలలో ఆవిష్కార్ సదస్సు ప్రారంభించి మాట్లాడారు. కంప్యూటర్‌సైన్స్ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు వున్నాయన్నారు. మారుతున్న సాంకేతిక నైపుణ్యాలను విద్యార్థులు ఎప్పటికప్పుడు పెంపొందించుకోవలసిన అవసరం ఉందన్నారు. మరో ప్రముఖుడు బాలకృష్ణ గంగున్ మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు ఎలా మెరుగుపరుచుకోవాలనే అంశాన్ని విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ ఆచార్య కె.ఎస్.బోస్, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రోగ్రాం డైరక్టర్ ఆచార్య పి.వి.వినయ్, ప్రొఫెసర్ డి.సరిత, విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

'ప్లాస్టిక్‌ను దూరం పెడతాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుంటాం'

సింహాచలం/పద్మనాభం/సాగర్‌నగర్/మధురవాడ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర సాధన లక్ష్యంగా ప్లాస్టిక్ వినియోగాన్ని మానేసి, ఆరోగ్యకర సమాజానికి పాటుపడతామని, ఇందుకోసం ప్రజలను చైతన్యపరుస్తామని అధికార, అనధికారులు శనివారం ప్రతిజ్ఞ చేశారు. స్వచ్ఛత అనేది నాగరికతకు, సంస్కృతికి ప్రతీక అన్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దామని సింహాచలం దేవస్థానం ఈవో కె.సుబ్బారావు పిలుపునిచ్చారు. పద్మనాభంలోని కుంతీమాధవస్వామి ఆలయ పరిసరాలను, మండల కార్యాలయాలను శుభ్రం చేశారు. పద్మనాభంలో ప్లాస్టిక్ నిషేధానికి తమవంతు కృషి చేస్తామని ఎంపీడీఓ ఎం.విజయకుమార్ ప్రజలతో మానవహారం చేయించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇచ్చే అలవాటు చేయించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సాగర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ లొడగల అప్పారావు నాయకత్వంలో ప్రతినబూనారు. వ్యర్థరహిత పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని ఆర్డీ జగదీష్, జిల్లా పర్యాటకశాఖ అధికారి సుధాసాగర్ అన్నారు. రుషికొండ బీచ్‌లో వ్యర్థాలను తొలగించి ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. మహావిశాఖ 98వ వార్డును ప్రథమస్థానంలో నిలుపుదామని వార్డు కార్పొరేటర్ పి.వి నరసింహం అన్నారు. ఒకసారి మాత్రమే వినియోగించే ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి ముప్పు కలుగుతుందని కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ అన్నారు. మధురవాడలో దుకాణదారులను చైతన్యపరిచారు. పీహెచ్‌సీ పరిసరాలను శుభ్రం చేశారు.



అప్పన్న ఉద్యోగుల స్వచ్ఛ ప్రతిజ్ఞ



పద్మనాభంలోని కుంతీమాధవస్వామి ఆలయం వద్ద శుభ్రం చేస్తున్న మహిళలు

నేడు మండల సమావేశం

భీమునిపట్నం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 16న నిర్వహిస్తున్నట్టు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎన్.హనుమంతరావు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో మీటింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

రాయిపాలెం హైస్కూలు విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

తగరపువలస, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 2వ వార్డు పరిధి రాయిపాలెం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు తగరపువలస సాయిసంహిత ట్రస్టు సభ్యులు శనివారం పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈ ట్రస్టు అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. అప్పలరాజు, సంతోషికుమారి వీటిని విద్యార్థులకు అందజేసి పరీక్షలను చక్కగా రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.. ఈ సమావేశానికి ప్రధానోపాధ్యాయిని జె.రాధాకుమారి అధ్యక్షత వహించారు. పరీక్షల విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శైలజ, ప్రమీల, కిరణ్, జగ్గుబాబు పేరెంటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు ఇవే...

... 5వ పేజీ తరువాయి

సంఖ్య ఆధారంగా టీచర్లను కేటాయిస్తారు. అంటే 20 నుంచి 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఇస్తారు.

4. ఆదర్శ పాఠశాలలు: ప్రతి పంచాయతీలో 60 మంది పిల్లలున్న ప్రాథమిక పాఠశాలను ఆదర్శ పాఠశాలగా ఎంపిక చేస్తారు. పీపీ-1, 2, ఒకటి నుంచి ఐదో తరగతి వరకు బోధన చేస్తారు. ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ప్రతి తరగతికి ఒక టీచర్‌ను కేటాయిస్తారు. గత ప్రభుత్వంలో ఉన్నత పాఠశాలలకు పంపిన 3,4,5 తరగతులను వెనక్కి తీసుకువచ్చి ఆదర్శ పాఠశాలలో చేర్చుతారు.

5. ఉన్నత పాఠశాలలు: గత ప్రభుత్వంలో 3, 4, 5 తరగతలు ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. కొత్త విధానంలో ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు మాత్రమే ఉంటాయి. ప్రాథమికోన్నత పాఠశాలలకు వస్తే 30 మంది కంటే తక్కువగా ఉన్నవాటిని ప్రాథమిక పాఠశాలలుగా మార్చుతారు. ఆరు, ఏడు, ఎనిమిది తరగతులను మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో విలీనం చేస్తారు. మూడు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉన్నా, 60 మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులున్న యూపీ పాఠశాలలను హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేస్తారు.

రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

... 5వ పేజీ తరువాయి

ప్రారంభమయ్యే సమయానికి అరగంట ముందు కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైతే అరగంట వరకు విద్యార్థులను అనుమతిస్తామని, అయితే ప్రతిరోజు ఆలస్యమైతే మాత్రం ప్రవేశం ఉండదని స్పష్టంచేశారు.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. హాల్ టికెట్ చూపి విద్యార్థులు కేంద్రాలకు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించవచ్చునని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫోన్లు తీసుకురావద్దని స్పష్టంచేశారు. చీఫ్ సూపరింటెండెంట్ తప్ప ఇన్విజిలేటర్లు కూడా సెల్‌ఫోన్లు తీసుకువెళ్లకూడదన్నారు. దివ్యాంగులు, మానసిక దివ్యాంగులు, అంధులు, ప్రమాదవశాత్తూ గాయాలకు గురైన విద్యార్థులు 265 మంది పరీక్షలు రాస్తున్నారని, వీరందరికీ తొమ్మిదో తరగతి చదివే విద్యార్థులను స్రైబ్‌గా అనుమతిస్తున్నామని చెప్పారు.

ఈనెల 17వ తేదీ నుంచి 28వ తేదీ వరకు 15 కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఓపెన్‌స్కూలు పరీక్షలు జరుగుతాయని డీఈవో వెల్లడించారు. ఈ పరీక్షలకు 938 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, వీరిలో విశాఖ సెంట్రల్ జైలులో గల 30 మందికి ఒక కేంద్రం ఏర్పాటుచేశామన్నారు. బయట నుంచి టీచర్లను ఇన్విజిలేటర్లగా నియమించామని ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ మురళీమోహన్ పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్ల మంజూరులో జాప్యం

... 5వ పేజీ తరువాయి

వివరణ ఇస్తూ...ఉమ్మడి జిల్లాలో కొత్త పింఛన్లకు అర్హులతో జాబితాను తయారుచేసి ప్రభుత్వానికి పంపామన్నారు. ప్రభుత్వం మంజూరుచేసిన వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు. పక్కా ఇళ్ల కోసం పలువురు పేదలు ఎదురుచూస్తున్నారని కొందరు సభ్యులు చెప్పగా...ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వే పూర్తయిన తరువాత కొత్తగా లబ్ధిదారులను గుర్తిస్తామని గృహ నిర్మాణ సంస్థ అధికారులు వెల్లడించారు. ఇప్పటికే ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లు డబ్బులను వెంటనే విడుదల చేయాలని చైర్‌పర్సన్ కోరారు.

కేజీహెచ్ మార్చురీలో పోస్టుమార్టంలో జాప్యం జరుగుతోందని చైర్‌పర్సన్ అనగా...సూపరింటెండెంట్ శివానంద స్పందిస్తూ...పోలీసులు శవపంచనామా చేసిన తరువాతే పోస్టుమార్టం చేయాలని, అందువల్ల ఆలస్యం అవుతున్నదని చెప్పారు. అయినప్పటికీ జాప్యం లేకుండా పోస్టుమార్టం పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు. కేజీహెచ్‌లో వైద్యం కోసం వచ్చే గిరిజనులకు విశ్రాంతి హాలు నిర్మించి అన్ని సదుపాయాలు కల్పించామని, గిరిజనులు దీనిని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఈ సమావేశాల్లో జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి ఇతర అధికారులు పాల్గొన్నారు. కాగా శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం ఉండడంతో పలు శాఖల అధికారులకు బదులు సిబ్బంది, ద్వితీయశ్రేణి అధికారులు సమావేశాలకు హాజరయ్యారు.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై కసరత్తు

... 5వ పేజీ తరువాయి

పాఠశాలకు తరలిస్తారు. జీవో 117 రద్దుతో కొత్తగా తెరపైకి వచ్చిన విధానం ప్రకారం ఐదు రకాల బడుల విధానం అమలుచేస్తారు. దీని ప్రకారం శాటిలైట్ ఫౌండేషన్ పాఠశాలలు, శాటిలైట్ పాఠశాలలు, బేసిక్ పాఠశాల, ఆదర్శ పాఠశాల, ఉన్నత పాఠశాలలు ఉంటాయి.

ఈ నేపథ్యంలో పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై జిల్లాలో 586 పాఠశాలల తల్లిదండ్రుల కమిటీల నుంచి అభిప్రాయాలు తీసుకున్నప్పుడు ప్రధానంగా ప్రాథమిక పాఠశాలల మనుగడపై సందేహం ఉన్నచోట వ్యతిరేకించారు. ఆనందపురం, పద్మనాభం, పెదగంట్యాడ, పెందుర్తి మండలాల్లో తక్కువ మంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలల తల్లిదండ్రుల కమిటీలు తమ సమ్మతి చెప్పలేదు. ఆయా గ్రామాల్లో ప్రజలు ముఖ్యంగా తల్లిదండ్రులను ఒప్పించే బాధ్యతను ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్‌కు ప్రభుత్వం అప్పగించింది. గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటుచేసి తల్లిదండ్రులను నచ్చజెప్పాలని సూచించింది. పిల్లల సంఖ్య మరీ తక్కువగా ఉంటే అక్కడ ఉన్న ఒకటి, రెండు తరగతులను సమీపంలోని పాఠశాలలకు పంపుతారని అటువంటప్పుడు గ్రామంలో శాటిలైట్ ఫౌండేషన్ స్కూలు ఉంటుందని చెప్పాలని సూచించింది. జీవో 117 అమలుతో ప్రాథమిక పాఠశాలల్లో పిల్లల సంఖ్య తగ్గిపోయింది. దీంతో కొన్ని చోట్ల పాఠశాలలు మూతపడ్డాయి. గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాలను మరోసారి చేస్తే గ్రామాల్లో ప్రాథమిక విద్య మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రతి గ్రామంలో ఒకటి నుంచి ఐదు తరగతులు కొనసాగే పాత విధానం అమలు చేయాలని కోరుతున్నార లేని పక్షంలో శివారు ప్రాంతాల్లో పిల్లలు విద్యకు దూరమవుతారని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

జీవనం భారమై, పిల్లలకు దూరమై...

... 5వ పేజీ తరువాయి

కన్నీటిపర్యంతమయ్యారు. మరికొందరు పిల్లలు...తల్లిదండ్రులకు ఒక ఆయాను ఏర్పాటు చేసి ఎప్పుడో ఒకసారి చుట్టం చూపుగా వచ్చి చూసి వెళుతున్నారు. ఇటువంటి వాళ్లు నగర పరిధిలోని అనేక ప్రాంతాల్లో ఉన్నారు. 'మా ఇంటికి వస్తే మీకే ఇబ్బందిగా ఉంటుంది... ఇక్కడే ఉండండి' అంటూ చెప్పి వెళ్లిపోతుం టారని హెచ్‌బీ కాలనీకి చెందిన 73 ఏళ్ల వృద్ధుడు పేర్కొన్నాడు.

బయటకు రాకూడదని..

వృద్ధాప్యంలో ఎంతోమంది తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. కానీ, బయటకు రానివ్వరు. పిల్లల పరువు పోకూడదన్న ఉద్దేశంతో వృద్ధా శ్రమాల్లో చేరుతున్నవాళ్లు కూడా వారి కుటుంబ సభ్యులు విషయాలను బయట వారికి చెప్పేం దుకు ఇష్టపడరు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితు ల్లో చెప్పాల్సి వచ్చినా..వారి గురించి ఎవరికీ చెప్పవద్దంటూ కోరుతుంటారు. తమ వల్ల పిల్లలకు చెడ పేరురాకూడదని కోరుకుంటుంటారు.

పిల్లలు చేరదీయకపోవడంతో మానసిక వేదన

\- డాక్టర్ ముత్యాల బాలాజీ, సైకాలజిస్ట్



వృద్ధాప్యంలో పిల్లలు దూరంగా పెట్టడం వల్ల తీవ్ర మానసిక వేదనను అనుభవి స్తుంటారు. కష్టపడి చదివించి, ప్రయోజకులను చేస్తే ఇప్పుడు పట్టించుకోవడం లేదని బాధ పడుతుంటారు. మానసికంగా కుంగిపోతున్నామని, నిద్ర కూడా పట్టడం లేదంటూ నెల కు ముగ్గురు, నలుగురు వస్తుంటారు. తాము ఒంటరి అయిపోయామన్న బాధ, భావన వారిలో అధికంగా ఉంటోంది. ఆ బాధ తగ్గేందుకు కౌన్సెలింగ్ ఇస్తుంటాం. పిల్లలు తమకు దగ్గరిలో ఉన్నా పట్టించుకోరని కొందరు వాపోతుంటారు. పిల్లల ప్రేమపూర్వకమైన మాట వారిని మానసిక సమస్యలు, నిద్ర లేమి ఇబ్బందుల నుంచి బయటపడేలా చేస్తుంది. కానీ, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు పడుతున్న బాధలు పిల్లలకు పట్టడం లేదు. కనీసం వారి గురించి ఆలోచించే తీరిక కూడా ఉండడం లేదు. కొందరు తల్లిదండ్రులకు కావాల్సిన డబ్బులు, సౌకర్యాలు కల్పిస్తున్నారు. కానీ, అవి వారికి మానసిక ఆనందాన్ని కలిగించేందుకు దోహదం చేయడం లేదు. అన్నీ ఉన్నా కుటుంబం లేదన్న భావన ఆ వయసులో వారిని తీవ్రంగా వేధిస్తుంది.

స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్ర సాధ్యం

» ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు » పలు కార్యాలయాలు, విద్యాసంస్థల్లో స్వచ్ఛ దివస్



ఏయూలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ దివస్‌లో పాల్గొన్న పరిసరాలను శుభ్రం చేస్తున్న రిజిస్ట్రార్



వెంకోజీపాలెం : పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

వెంకోజీపాలెం, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్రతోనే స్వర్ణాంధ్రా సాధ్యం అని ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయరావు పేర్కొన్నారు. వర్సిటీలోని ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిధిగా రిజిస్ట్రార్ పాల్గొని ప్రసంగించారు. ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలని కోరారు. ప్లాస్టిక్ యుద్ధ ప్రాతిపదికన నిర్మూలించాలని, దీనిలో ప్రజా భాగస్వామ్యం ఎంతో ముఖ్యం అన్నారు. ప్లాస్టిక్ రహిత ఏయూ దిశగా అడుగులు వేస్తున్నట్టు చెప్పారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, సోషల్ వర్క్ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.హరనాథ్ మాట్లాడుతూ సమాజ ప్రగతిలో ఎన్ఎస్ఎస్ క్రియాశీలక పాత్ర పోషిస్తున్నట్టు పేర్కొన్నారు. వాలంటీర్లను నిత్యం అప్రమత్తం చేస్తూ ప్రజా సంక్షేమ కార్యక్రమాలలో భాగస్వామ్యం చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ఈ అధ్యాపకులు డాక్టర్ వై.శ్రీదేవి, డాక్టర్ జి.విద్యావతి, ఐఏఎస్ఈ విభాగం, సోషల్ వర్క్ విభాగం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఏయూ ప్రాంగణంలో..

వెంకోజీపాలెం : ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో జాతీయ సేవా పథకం యూనిట్-2 ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విభాగ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని మొక్కలతో నిండి ఉన్న విభాగం గార్డెన్‌ను శుభ్రపరిచారు. అలాగే విభాగం చుట్టు పక్కలా ఉన్న ప్రదేశాల్లో చెత్తను తీసివేసి ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ రహిత విభాగంగా తీర్చిదిద్దారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను వేరు చేసి డస్ట్ బిన్‌లో పడవేశారు. ఈ కార్యక్రమాన్ని విభాగాధిపతి ప్రొఫెసర్ జాలాది రవి ప్రారంభించి, విద్యార్థులతో కలిసి స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో ఉత్సాహంగా పాల్గొని విభాగంలో పర్యావరణాన్ని మనం కాపాడుకుంటే అది మనల్ని మన సమాజాన్ని కాపాడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం యూనిట్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బోరుగడ్డ సుబ్బయ్య, 100కు పైగా వాలంటీర్లుపాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలి

వెంకోజీపాలెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పిలుపునిచ్చారు. శనివారం 16వ వార్డు కేఆర్ఎం కాలనీ పార్కు వద్ద ఏర్పాటు చేసిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని స్వచ్ఛతా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు, నాయకులు ప్రతి ఒక్కరికి ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించాలన్నారు. ఎప్పటికప్పుడు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ రహిత వస్తువులను మాత్రమే ప్రతి ఒక్కరూ వినియోగించాలని కోరారు. ఈ మేరకు స్వచ్ఛ ఆంధ్రపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. 2025 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖకు మొదటి స్థానం లభించే దిశగా ప్రతి ఒక్కరు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా జోన్-3 జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ అక్కడ ఉన్న వారందరితో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారు గోపి, ముగడ వాసు, పల్లా ఉమారాణి, బుగత సత్యనారాయణ, మొల్లి శంకర్, జి.అప్పన్న, బంగారాజు, మొల్లి శోభ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, శుభం మేస్త్రీలు నమ్మి చిన్నరాజు, జి.బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ, మార్చి13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13 వవ వార్డులో స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదం, పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించండి అనే నినాదంతో ఆరిలోవ కాలనీ ఆఖరి బస్టాపు నుంచి దుర్గాబజార్ వరకు ర్యాలీ నిర్వమించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీతసత్యన్నారాయణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి క్లాత్ బ్యాగులను వాడాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు,టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిబాలస్వామి, శానిటరీసిబ్బంది, సచివాయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎంవీపీ రైతు బజార్‌లో...

ఎంవీపీ కాలనీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ రైతు బజార్‌లో రైతులు శ్రమదానం చేసి, ఆవరణను శుభ్రం చేశారు. అనంతరం పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పద్దెనిమిదో వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, రైతు బజార్ ఎస్టేట్ అధికారి వరహాలు పాల్గొన్నారు.



వెంకోజీపాలెం : ఏయూలో మొక్కలను నాటుతున్న విద్యార్థులు



ఎంవీపీ కాలనీ : రైతుబజార్‌లో శుభ్రం చేస్తున్న రైతులు

ఆరుగురు కబ్జాదారులపై కేసు నమోదు

కూర్మన్నపాలెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి స్థలాలను కబ్జా చేసిన ఆరుగురిపై దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదగంట్యాడ సమీపం దిబ్బపాలేనికి చెందిన నాగల్ల గీతామణి, కారి నాగమ్మలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే 87వ వార్డు పరిధి వడ్లపూడిలో ఆర్-కార్డు హోల్డర్ పల్లేటి పోలయ్యకు చెందిన ప్లాట్ నంబర్-1295, కర్రి నాగమ్మకు చెందిన ప్లాట్ నంబర్-1294లకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కబ్జాదారులు వేరొకరికి విక్రయించారంటూ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. లోకేశ్ ఆదేశాల మేరకు సీపీ ఆధ్వర్యంలో దువ్వాడ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. పోలీసుల విచారణలో లీగల్ హెయిర్ సర్టిఫికెట్, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన చేకూరి రామచంద్రరాజు, ఈగల లక్ష్మి, పరశురామ్, ఈగల హేమగోపాల్, వెంకటనరసమ్మ, కొల్లా మాణిక్యంపై దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాధవధారలో మహిళ మెడలో గొలుసు చోరీ



పోలీసులు విడుదల చేసిన అనుమానిత వ్యక్తి ఫోటో

మాధవధార, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మాధవధార డీమార్ట్ సమీపంలోని నివాసిత ప్రాంతంలో శనివారం మధ్యాహ్నం గొలుసు దొంగ హల్‌చల్ చేశాడు. ఎయిర్‌పోర్ట్ జోన్ క్రైమ్ విభాగం పోలీసు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హైవే రోడ్డు నుంచి రెండో లైన్ నివాసిత ప్రాంతంలో నడిచి వెళ్తున్న వారణాసి రజని అనే మహిళ మెడలో రెండు తులాల బంగారు పుస్తెల తాడును దుండగుడు తెంచుకుని వెళ్లాడు. బాధితురాలు సమీపంలోనే ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నారు. మధ్యాహ్నం భోజన విరామానికి 2.20 గంటల సమయంలో వంశీనగర్‌లోని ఇంటికి వస్తుండగా ఈ ఘటన జరిగినట్లు దగ్గర్లోని సీసీ కెమేరాల్లో నమోదైంది. పుస్తెల తాడు తెంచేసిన సమయంలో సూత్రాలు గట్టిగా పట్టుకోవడంతో ఆమె చేతిలోనే వదిలేసి రెండు తులాల గొలుసుతో పారిపోయాడు. వెస్ట్ జోన్ క్రైమ్ ఏసీపీ లక్ష్మణరావు, సీఐ శ్రీనివాసరావు, సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీసీ కెమేరా ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించే పనిలో ఉన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై రాగా, ఒకరు వాహనంతో దూరంగా నిల్చోగా, నిందితుడు గొలుసు లాక్కుని ఇద్దరూ కలిసి పారిపోయి ఉంటారని పోలీసు అధికారులు అనుమానిస్తున్నారు.

సచివాలయాలకు 4,631 బయోమెట్రిక్ యంత్రాలు

మహారాణిపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వివిధ రకాల సర్వేలు, సేవలు అందించేందుకు వీలుగా జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాలకు కొత్తగా 4,631 బయోమెట్రిక్ యంత్రాలు వచ్చినట్లు జిల్లా కో-ఆర్డినేటర్ ఉషారాణి తెలిపారు. వీటిని కలెక్టర్ ద్వారా అందజేసినట్లు పేర్కొన్నారు. సేవలను మరింత వేగవంతం చేసేందుకు, సాంకేతిక కార్యకలాపాలను త్వరగా నిర్వహించేందుకు వీలు పడుతుందని తెలిపారు.

ఆర్టీసీ డిపోల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం

» ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు



ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్ఎం అప్పలనాయుడు, ఆర్టీసీ ఇతర అధికారులు

ద్వారకా బస్‌స్టేషన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ విశాఖ రీజియన్‌లోని అన్ని డిపోలు, గ్యారేజీలు, కాంప్లెక్సుల్లోను పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం విశాఖపట్నం డిపోలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించడం జరిగిందని, అలాంటి వస్తువులను ఆర్టీసీ కాంప్లెక్సుల్లోని స్టాళ్లలో వినియోగించకుండా డిపో మేనేజర్లు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్టీసీ స్థలాల్లోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి సూచించారు. రీజియన్‌లోని అన్ని డిపోల్లోను గోనె సంచులు పంపిణీ చేయడం జరిగిందని, వాటిలో వ్యర్థాలు ఉంచేందుకు మాత్రమే వినియోగించాలని అన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర-స్వచ్ఛదివస్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్లు, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్లు, సూపర్‌వైజర్లు, కంట్రోలర్లు పాల్గొన్నారు.

వాహనదారుల నుంచి చలానాల పైకం వసూలు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆరిలోవ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ద్విచక్రవాహన చోదకుడు తప్పకుండాహెల్మెట్‌ధరించి వాహనాలను నడపాలని ఆరిలోవ ట్రాఫిక్ ఎస్ఐ శ్రీకాంత్ హనుమంతవాక కూడలి వద్ద శనివారం వాహన చోదకులకు అవగాహన కల్పించారు. అనుకోకుండా ప్రమాదం జరిగితే ఇంటి పెద్ద దిక్కును కోల్పేయేప్రమాం ఉందన్నారు. అలాగే కారు నడిపే వారు తప్పకుండా సీటు బెల్ట్ దరిందాలని, లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా వాహనం నడిపిన వారి నుంచి అపరాద రుసుంలు వసూల చేశారు.

వినియోగదారులకు హక్కులపై అవగాహన అవసరం

డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారుల హక్కులపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు తెలిపారు. కృష్ణా కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రపంచ వినియోగదార్ల హక్కుల దినోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వస్తువుల తూకం, ధరలు, నాణ్యతలో లోపాలుంటే వినియోగదారుల హక్కు చట్టం కింద కేసులు నమోదు చేసి న్యాయం పొందవచ్చన్నారు.

వినియోగదారుల రక్షణమండలి కార్యదర్శి లింగేశ్వరరావు మాట్లాడుతూ తమ మండలి ద్వారా వినియోగదారుల ఎన్నో కేసులు పరిష్కరించామన్నారు. కొనుగోలు చేసే ఉత్పత్తుల్లో మోసం చేస్తే వినియోగదారుల కోర్టుల ద్వారా నష్ట పరిహారం పొందవచ్చన్నారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు పోల ఉమామహేశ్వరరావు, రవిబాబు, బి.లక్ష్మీ, బి.నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాలు జ్ఞానాన్ని అందించే కేంద్రాలు

ఐఐటీ (చెన్నై) ప్రొఫెసర్ బీవీఎస్ ప్రసాద్ పట్నాయక్



ప్రసంగిస్తున్న బీవీఎస్ ప్రసాద్ పట్నాయక్

వెంకోజీపాలెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : విశ్వవిద్యాలయాలు జ్ఞానాన్ని అందించే కేంద్రాలుగా మాత్రమే నిలవాలని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (చెన్నై) అప్లైడ్ మెకానిక్స్, బయో మెడికల్ ఇంజనీరింగ్ విభాగాచార్యులు బీవీఎస్ ప్రసాద్ పట్నాయక్ అన్నారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో శనివారం ఆయన ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రత్యేక ప్రసంగం అందించారు. విద్యార్థులు తమకు నచ్చిన సబ్జెక్టులను ఎంచుకునే స్వేచ్ఛను కల్పించాలని సూచించారు. ఇంజనీరింగ్ విద్యలో అడిగిడే ప్రతి విద్యార్థి బలమైన గణితశాస్త్ర పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలని, దీన్ని మరింత పెంపొందించుకునే దిశగా కృషి చేయాలన్నారు. ఇంజనీరింగ్ విద్య స్వరూపాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య కొంత దూరం ఉందని వీలైనంత వరకు దీన్ని తగ్గిస్తూ అనుసంధానం చేయడం అవసరమన్నారు. ప్రస్తుతం మనం అందిస్తున్న కరికులం విద్యార్థుల భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఉన్నదా? మార్పులు అవసరమా అనే విషయాన్ని తరచూ గమనించాలన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే వివిధ పోటీ పరీక్షల సిలబస్ మార్పులు వాటి ఆవశ్యకతను ఉదాహరించారు. విశ్వవిద్యాలయాలు ఉద్యోగాల కల్పన లక్ష్యంగా చేసుకోకూడదని, జ్ఞానాన్ని అందించడమే ప్రధాన లక్ష్యంగా వీటి నిర్వహణ సాగాలన్నారు. జాతీయ విద్యా సంస్థలో నిర్వహిస్తున్న డ్యూయల్ డిగ్రీ కోర్సుల నిర్వహణ నాలుగేళ్ల కోర్సు పూర్తి చేసిన తర్వాత విద్యార్థి తమ నైపుణ్యాలను మనసుకు నచ్చిన మరొక నూతన అంశాన్ని ఎంపిక చేసుకుని చదివే వెసులుబాటు కలిగి ఉంటుందని చెప్పారు. జాతీయ స్థాయిలో పరిశోధన ప్రాజెక్టులను అందించే వివిధ సంస్థలు వాటి స్వరూపాన్ని తెలియజేశారు. భవిష్యత్తులో డీప్ ఫేక్ ఇన్వెస్టిగేటర్స్, ప్రైవసీ గార్డియన్స్ , ఏఐ ఎథిక్స్ కన్సల్టెంట్ ఇంజనీర్ వంటి నూతన ఉద్యోగాలు వస్తాయన్నారు. అనంతరం ఆచార్యులు విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్, ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'విమ్స్'లో స్వచ్ఛ దివస్



విమ్స్‌లో పరిసరాలు శుభ్రం చేస్తున్న డైరెక్టర్ డాకర్ రాంబాబు, వైద్యులు, సంస్థ సిబ్బంది

ఆరిలోవ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ (విమ్స్)లో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంద కార్యక్రమాన్ని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా విమ్స్ ఆసుపత్రి అవరణ, ఆస్పత్రి గదులు, పరిసరాలను పరిశుభ్రం చేశారు. .ఈ సంధర్భంగా డైరెక్టర్ డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ప్రతి నెలా మూడో శనివారం చేపడుతున్నట్టు చెప్పారు. చేపట్టినట్లు తెలిపారు. మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనం అంతా ఆరోగ్యంగా ఉంటామన్నారు. వైద్యం కోసం వస్తున్న రోగులు ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అప్పడు ఆస్పత్రి ప్రాంగణంలో ఆహ్లాద వాతావరణం నెలకొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విమ్స్ డిప్యూటీ డైరక్టర్ శ్రీనివాసరావు, ఏవో బాజిత్ సిబ్బంది పాల్గోన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి అంతా గుడ్డ సంచులు, పేపర్ బ్యాగ్‌లను గోనె సంచులను వాడాల పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల మానవ జాతితో పాటు సకల జీవరాశుల మనుగడ ప్రమాదకరంగా మారుతుందన్నారు.

సినిమా గైడ్

- **కోర్ట్** : సంగం, శ్రీ వెంకటేశ్వర-1, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి),
- **దిల్‌రుబా** : జగదాంబ, శ్రీకన్య, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **శబ్దం** : సంగం, శారద, కిన్నెర,
- **మజాకా** : రమాదేవి, శ్రీరామా, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం),
- **డ్రాగన్** : జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **తండేల్** : శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం** : మెలోడీ, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్** : శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్** : మెలోడీ, కామేశ్వరి, కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 40,వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 40, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 42, బీరకాయలు 54, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 27 దొండకాయలు 38, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది)50, బరబాటి 38, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 48, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరి కాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 26, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	70
లైవ్ ధర	90
విత్ స్కిన్	150
స్కిన్‌లెస్	160

ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు

కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న పీసీబీ ఇంజనీర్ శ్రీనివాసరావు

15ఎమ్‌డిపి1: మద్దిలపాలెం, మార్చి15(ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి అత్యంత ప్రమాదకరమని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ శ్రీనివాసరావు చెప్పారు. మద్దిలపాలెం, డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా జీవనం విధానంలో ప్లాస్టిక్ ఒక భాగమై పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. వస్తువులను కొనుగోలు చేసి తీసుకెళ్లడం దగ్గర నుంచి ఆహారం పదార్థాలు పెట్టుకుని తినే వరకు ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్లాస్టిక్ వినియోగం వల్ల కాలుష్య కారకాలు ఉత్పత్తై పర్యావరణానికే కాకుంగా మనుషుల ఆరోగ్యాన్ని నాశనం చేస్తుందని చెప్పారు.

అనంతరం ప్లాస్టిక్‌కు దూరంగా ఉంటామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి

టీడీపీ నేత నక్కా కనకరాజు



రామ్‌నగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేస్తున్న టీడీపీ నేతలు, జీవీఎంసీ సిబ్బంది

రామ్‌నగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తూ, మన పరిసరాలలో ప్లాస్టిక్ నిషేధించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలుగుదేశం పార్టీ 28వ వార్డు ఇన్‌చార్జు నక్కా కనకరాజు పిలుపునిచ్చారు.

శనివారం రామ్‌నగర్‌లో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంద ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అవగాహన కల్పిస్తూ జీవీఎంసీ కార్యాలయం నుంచి శానిటరీ సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు మహిళలతో వార్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను నిషేధిస్తామంటూ అందరితో ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ కొండలరావు, జయలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఆర్పీలు, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

ప్లాస్టిక్ వాడొద్దు.. క్యాన్సర్ బారిన పడొద్దు: కలెక్టర్



రైల్వే న్యూకాలనీలో ప్రసంగిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చిత్రంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తదితరులు



స్వచ్ఛత ప్రతిజ్ఞ చేస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, వైద్యులు, సిబ్బంది తదితరులు

అక్కయ్యపాలెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వస్తువులు వాడొద్దు... క్యాన్సర్ బారిన పడొద్దని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రైల్వేన్యూకాలనీలోని సుబ్బలక్ష్మి కల్యాణమండపంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులకు బదులు ఇతర ప్రత్యామ్నాయాలు వాడాలని సూచించారు. ఒకసారి వాడిన ప్లాస్టిక్ వస్తువుల వల్ల కలిగే నష్టాలను ప్రజలకు తెలియజేయాలని, వాటి వినియోగాన్ని తగ్గించేందుకు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాల్సిన ఆవశ్యకత ఉందని ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అన్నారు. మేయర్ హరి వెంకటకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రయత్నాలను అర్థం చేసుకుని భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డిప్యూటీ మేయర్ కె.సతీష్, కార్పొరేటర్లు పెద్దిశెట్టి ఉషశ్రీ, రాజశేఖర్ పాల్గొన్నారు. నరసింహనగర్ రైతుబజార్‌ను రైతులు, డ్వాక్రా సభ్యులు శుభ్రం చేశారు. ఎస్టేట్ అధికారి కొండబాబు పాల్గొన్నారు.

మహారాణిపేట: పర్యావరణానికి ముప్పు తేవడమేగాక, ప్లాస్టిక్ క్యాన్సర్‌కు కారణమని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్ పేర్కొన్నారు. గుడ్డ సంచులు వాడాలని ప్రజలకు సూచిస్తూ ఆసుపత్రి వైద్యులు, నర్సులు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించినట్లు తెలిపారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాసవీ లత, డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ వి.రవి, ఆర్‌ఎంవో డాక్టర్ మెహర్‌కుమార్, పాలనాధికారి బి.వి.రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డాబాగార్డెన్స్: ప్లాస్టిక్ వస్తువులతో మానవాళికి ఎదురవుతున్న ఉపద్రవంపై ప్రతిఒక్కరూ ప్రజలకు తెలియజేయాలని జీవీఎంసీ 31వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.కామేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయగా నార, గుడ్డ సంచులను వినియోగించాలని సూచించారు. సమష్టిగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

కంచరపాలెం: పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జిల్లా సమన్వయకర్త డా.కె.వి.రమణ పేర్కొన్నారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాల విద్యార్థులతో ఆయన ప్రమాణం చేయించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి చెత్తాచెదారాన్ని తొలగించారు. రమణ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే మంచి ఆరోగ్యం సాధ్యమన్నారు. సలహాదారు కె.వరహాలు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది నాయకులు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

దొండపర్తి: 27వ వార్డులోని పలు ప్రాంతాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఐత కృష్ణ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ గొలగాని వీరారావు బజ్జీ వ్యాపారులను కలిసి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల ఇబ్బందులను వివరించారు. జోన్-3 జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఏఎంహెచ్‌వో వరప్రసాద్, ఎస్‌ఎస్ సత్యనారాయణ, ప్రత్యేకాధికారిణి వాణి పాల్గొన్నారు.

సీతమ్మధార: టీపీటీ కాలనీలోని బృందావన్ పార్క్‌లో ర్యాలీ నిర్వహించారు. టీపీఆర్‌డబ్ల్యుఏ సభ్యులు, అధ్యక్షులు, కార్యదర్శి, స్థానిక శానటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్‌పి వెంకటేశ్వరన్, సూపర్‌వైజర్ రమణ పాల్గొన్నారు. రైతుబజార్‌లో స్పెషల్ ఆఫీసర్ పైడిరాజు అవగాహన కల్పించారు.



బృందావన్ పార్కులో గుడ్డ సంచులు ప్రదర్శిస్తున్న జీవీఎంసీ సిబ్బంది, స్థానికులు



కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఉన్నత పాఠశాలలో సామాజిక తనిఖీ



మౌలిక సదుపాయాల వివరాలను వెల్లడిస్తున్న సీఆర్పీ భాగ్యలక్ష్మి

అక్కయ్యపాలెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో శనివారం సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) జరిగింది. సీతమ్మధార మండల క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్పీ) భాగ్యలక్ష్మి పాఠశాలలోని మౌలిక సదుపాయాల వివరాలను వెల్లడించారు. పరిశీలించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ వంగల అప్పలరాజు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలకు అవసరమైన సదుపాయాల కోసం చర్చించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీనరస, పీడీ .సునంద్ పాల్గొన్నారు.

సచివాలయాలకు 4,631 బయోమెట్రిక్ యంత్రాలు

మహారాణిపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వివిధ రకాల సర్వేలు, సేవలు అందించేందుకు వీలుగా జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాలకు కొత్తగా 4,631 బయోమెట్రిక్ యంత్రాలు వచ్చినట్లు జిల్లా కో-ఆర్డినేటర్ ఉషారాణి తెలిపారు. వీటిని కలెక్టర్ ద్వారా అందజేసినట్లు పేర్కొన్నారు. సేవలను మరింత వేగవంతం చేసేందుకు, సాంకేతిక కార్యకలాపాల నిర్వహణకు వీలు పడుతుందని తెలిపారు.

శాంతి సదస్సుకు ప్రకాశరావు

డాబాగార్డెన్స్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ రిలీజియన్స్ ఇనిషియేటివ్ ఆధ్వర్యంలో ఈ నెల 18, 19 తేదీల్లో పుదుచ్చేరిలో జరగనున్న 'శాంతి-అభివృద్ధి' అంశంపై జాతీయ సదస్సు జరగనుంది. పాల్గొనాల్సిందిగా నగరానికి చెందిన ఏవీఎన్ కళాశాల రిటైర్డ్ వైస్ ప్రిన్సిపాల్ నరవ ప్రకాశరావుకు ఆహ్వానం అందింది. శాంతితోనే అభివృద్ధి సాధ్యమవుతుందనే అంశంపై వ్యాసాన్ని సమర్పించనున్నట్లు ప్రకాశరావు తెలిపారు.

మహిళా కళాశాలలో 20, 21 తేదీల్లో సైన్స్ వర్కుషాపు

విశాఖపట్నం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల రసాయనిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో 'ఫ్రాంటియర్స్ ఇన్ కెమికల్ సైన్సెస్' అనే అంశంపై వర్కుషాపు నిర్వహిస్తారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ వర్కుషాపు కన్వీనర్‌గా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్, బెంగళూరు ప్రొఫెసర్ కె.ఆర్.ప్రసాద్, కో-ఆర్డినేటర్ లెక్చరర్ ఇన్ కెమిస్ట్రీ డాక్టర్ బి.కల్యాణరామ్ వ్యవహరిస్తారు. వర్కుషాపు నిర్వహణకు బెంగళూరు సైన్స్ అకాడమీ నిధులు సమకూర్చినట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ కళాశాలల రసాయన శాస్త్ర అధ్యాపకులు, నిపుణులు, మేధావులు పాల్గొంటారని పేర్కొన్నారు.

లిహూరి స్టేషన్‌లో అన్ని రైళ్లకు తాత్కాలిక హాల్ట్

విశాఖపట్నం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): డోలా యాత్రకు హాజరయ్యే ప్రయాణికుల సౌకర్యార్థం వాల్తేరు డివిజన్ పరిధిలోని నౌపడ-గుణుపూర్ లైనులో గల లిహూరి స్టేషన్‌లో ఈ నెల 15 నుంచి 23 వరకు అన్ని రైళ్లకు తాత్కాలికంగా హాల్ట్ కల్పిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. నౌపడ-గుణుపూర్ మార్గం మీదుగా నడిచే అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు రెండు నిమిషాలపాటు లిహూరి స్టేషన్‌లో ఆగుతాయని, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్డు మధ్యలో సరకుల అన్‌లోడింగ్!

విశాఖపట్నం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): బుల్లయ్య కళాశాల నుంచి రామా టాకీస్‌కు వెళ్లే మార్గాన్ని ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల సిబ్బంది సొంత జాగీరులా ఉపయోగించుకుంటున్నారు. రోడ్డు పక్కనే బారులుగా బస్సులను పార్కింగ్ చేసి ట్రాఫిక్ సమస్యలు సృష్టిస్తున్నారు. అక్కడితో ఆగకుండా హైదరాబాద్ వంటి దూరప్రాంతాల నుంచి లగేజీని బుక్ చేసుకొని బస్సుల్లో తెచ్చి, వాటిని ఈ మార్గంలో నడిరోడ్డుపై అన్‌లోడింగ్ చేస్తున్నారు. బస్సు పక్కనే మినీ లారీలు పెట్టి వాటిలో సరకులు వేస్తున్నారు. ఇలా మార్గంలో సగానికి పైగా వారే ఆక్రమిస్తుండటంతో వెనక వచ్చేవారు చాలా సేపు వాహనాలతో ఆగిపోవలసి వస్తోంది. ట్రాఫిక్ పోలీసులు ఈ సమస్యపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



బుల్లయ్య కళాశాల మార్గంలో నిలిపిన ప్రైవేటు బస్సులు

వైభవంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

మహారాణిపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కంచరవీధిలో వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. శనివారం ఎంబారు మన్నారు స్వామి దేవస్థానంలో శ్రీవారి మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ ఉత్సవాలను పురస్కరించుకొని వెంకటేశ్వర స్వామికి పట్టువస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ నర్సింగ్ హాస్టల్‌కు 20 మంచాల వితరణ

మహారాణిపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో స్కూల్ ఆఫ్ నర్సింగ్ విభాగం హాస్టల్‌కు 20 మంచాలను వితరణ చేసింది. విశాఖ సేఫ్టీ కౌన్సిల్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ ట్రస్టు రోటరీ క్లబ్‌ఆఫ్ ఐఆర్ ఐఎస్ సంయుక్తంగా శనివారం కేజీహెచ్‌లోని ప్రభుత్వ నర్సింగ్ హాస్టల్‌లో పడకల వితరణ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన దక్షిణ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ ద్వారా 20 మంచాలను అందించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ తాగునీటి కోసం ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.వి. మంగాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన గ్లకోమా వారోత్సవాలు



ర్యాలీలో పాల్గొన్న వైద్య నిపుణులు, సిబ్బంది

సీతమ్మధార, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): గ్లకోమా వారోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ర్యాలీని ప్రారంభించారు. ప్రాంతీయ నేత్ర వైద్యశాల నుంచి సత్యం జంక్షన్ మీదుగా రామాటాకీస్ వరకు, అక్కడి నుంచి నేత్ర వైద్యశాల వరకు ర్యాలీ కొనసాగింది. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్. ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి, ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతిర్మయి, అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ ఎ.వి.రమణ, డాక్టర్ మాధవి, ఇతర వైద్యులు, జూనియర్ వైద్యులు, ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి సిబ్బంది, గీతం, విశాఖ ఐ ఆసుపత్రి, ప్రాంతీయ నేత్ర వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం నేత్ర వైద్యశాలలో ఏర్పాటు చేసిన ముగింపు సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం. సంధ్యాదేవి గ్లకోమా వ్యాధి నివారణకు సూచనలు చేశారు. ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ మీనాక్షిని, స్క్రీనింగ్ క్యాంప్‌లు నిర్వహించిన డాక్టర్ సౌజన్య, డాక్టర్ వాణీశ్రీలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పారామెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మొండి బకాయిల వసూలుకు ప్రయత్నించండి: జడ్సీ

అల్లిపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఆస్తి, నీటిపన్ను బకాయిల వసూలుకు రెవెన్యూ అధికారులు, సచివాలయ కార్యదర్శులు దృష్టి సారించాలని జడ్సీ ఎం.మల్లయ్యనాయుడు కోరారు. శనివారం సాయంత్రం జోన్-4 కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బకాయిలు చెల్లించనివారితో నేరుగా మాట్లాడి రాబట్టాలన్నారు. పన్ను చెల్లింపుపై అవగాహన కల్పించేందుకు ఆటోలు, జప్తు వాహనాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టే పీ4 సర్వే కార్యక్రమాన్ని ప్రజలకు వివరించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. ఏపీడీ పద్మావతి, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆర్‌ఓ అప్పలరాజు, ఆర్‌ఐలు సీతారామయ్య, వీరబాబు పాల్గొన్నారు.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న జడ్సీ మల్లయ్య నాయుడు తదితరులు

'ప్రాజెక్టులతో సంప్రదాయ మత్స్యకారులకు నష్టం'

మహారాణిపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సీఎఫ్‌టీయూఐ ఆధ్వర్యంలో మత్స్యకారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఫ్రీ ట్రేడ్ యూనియన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు కె.కనకారావు తెలిపారు. శనివారం గోకుల్ పార్కు సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆర్థిక సరళీకరణ, ప్రైవేటీకరణ విధానంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సాగరమాల బ్లూ ఎకానమీ, కోస్టల్ రెగ్యులరైజేషన్ జోన్ తదితర ప్రాజెక్టుల అమలు వల్ల సముద్ర తీర ప్రాంతాల్లో నివసిస్తున్న సంప్రదాయ మత్స్యకారులు జీవనోపాధి కోల్పోయి, దోపిడీ, పీడనకు గురవుతున్నారని పేర్కొన్నారు. వీరిని గ్రామాల నుంచి పునరావాస కాలనీలకు తరలించటం వల్ల తమ నివాస గుర్తింపుతో పాటు ఆత్మగౌరవాన్ని కోల్పోతున్నారని చెప్పారు. దీనిని అవకాశంగా తీసుకొని కొన్ని ఏజెన్సీలు సామాజిక సంక్షేమ భద్రతా అవకాశాలు కల్పిస్తామని మభ్యపెట్టి ఇతర ప్రాంతాలకు, దేశాలకు చట్ట వ్యతిరేకంగా తరలించే అవకాశం ఉందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో మత్స్యకార గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యదర్శి కె.లక్ష్మి, కో-ఆర్డినేటర్ కె.ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సీఎఫ్‌టీయూఐ ప్రతినిధులు

ఈ కల్వర్టుకు మోక్షమెప్పుడు?

జ్ఞానాపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఏడాది క్రితం కాన్వెంటు కూడలి నుంచి మనోరమ జంక్షన్‌వైపు, రైల్వే స్టేషన్‌రోడ్డు, అంబేద్కర్ సర్కిల్‌రోడ్లను కలిపే ప్రధాన కూడలిలో ఉన్న ఒక కల్వర్టును శుభ్రపరిచేందుకు దిమ్మలను జీవీఎంసీ అధికారులు తొలగించి అక్కడే వదిలేశారు. గత ఏడాది ఒక వైపు దిమ్మలు తొలగించి రక్షణ కల్పించకపోవడంతో అందులో పడి ఓ యువకుడు ప్రాణాలు విడిచాడు. దీంతో జీవీఎంసీ అధికారులు యువకుడు పడిపోయిన ప్రదేశంలో గ్రిల్స్ ఏర్పాటు చేశారు. కానీ రోడ్డుకు మధ్యలో ఉన్న ఈ కల్వర్టుకు తూతూ మంత్రంగా పనులు చేపట్టి అలాగే వదిలేశారు. మరో ప్రమాదం జరగకుండా పూర్తిస్థాయిలో పనులు చేపట్టాలని పాదాచారులు, వాహన చోదకులు కోరుతున్నారు.



సగంలో నిలిపివేసిన పని

రేపటి నుంచి టెన్త్ పరీక్షలు

... 5వ పేజీ తరువాయి

ప్రారంభమయ్యే సమయానికి అరగంట ముందు కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైతే అరగంట వరకు విద్యార్థులను అనుమతిస్తామని, అయితే ప్రతిరోజు ఆలస్యమైతే మాత్రం ప్రవేశం ఉండదని స్పష్టంచేశారు.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. హాల్ టికెట్ చూపి విద్యార్థులు కేంద్రాలకు ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించవచ్చునని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, ఫోన్లు తీసుకురావద్దని స్పష్టంచేశారు. చీఫ్ సూపరింటెండెంట్ తప్ప ఇన్విజిలేటర్లు కూడా సెల్‌ఫోన్లు తీసుకువెళ్లకూడదన్నారు. దివ్యాంగులు, మానసిక దివ్యాంగులు, అంధులు, ప్రమాదవశాత్తూ గాయాలకు గురైన విద్యార్థులు 265 మంది పరీక్షలు రాస్తున్నారని, వీరందరికీ తొమ్మిదో తరగతి చదివే విద్యార్థులను స్క్రైబ్‌గా అనుమతిస్తున్నామని చెప్పారు.

ఈ నెల 17వ తేదీ నుంచి 28వ తేదీ వరకు 15 కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఓపెన్‌స్కూలు పరీక్షలు జరుగుతాయని డీఈవో వెల్లడించారు. ఈ పరీక్షలకు 938 మంది విద్యార్థులు హాజరవుతున్నారని, వీరిలో విశాఖ సెంట్రల్ జైలులో గల 30 మందికి ఒక కేంద్రం ఏర్పాటుచేశామన్నారు. బయట నుంచి టీచర్లను ఇన్విజిలేటర్లుగా నియమించామని ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ మురళీమోహన్ పాల్గొన్నారు.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై కసరత్తు

... 5వ పేజీ తరువాయి

పాఠశాలకు తరలిస్తారు. జీవో 117 రద్దుతో కొత్తగా తెరపైకి వచ్చిన విధానం ప్రకారం ఐదు రకాల బడుల విధానం అమలుచేస్తారు. దీని ప్రకారం శాటిలైట్ ఫౌండేషన్ పాఠశాలలు, శాటిలైట్ పాఠశాలలు, బేసిక్ పాఠశాల, ఆదర్శ పాఠశాల, ఉన్నత పాఠశాలలు ఉంటాయి.

ఈ నేపథ్యంలో పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై జిల్లాలో 586 పాఠశాలల తల్లిదండ్రుల కమిటీల నుంచి అభిప్రాయాలు తీసుకున్నప్పుడు ప్రధానంగా ప్రాథమిక పాఠశాలల మనుగడపై సందేహం ఉన్నచోట వ్యతిరేకించారు. ఆనందపురం, పద్మనాభం, పెదగంట్యాడ, పెందుర్తి మండలాల్లో తక్కువ మంది విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలల తల్లిదండ్రుల కమిటీలు తమ సమ్మతి చెప్పలేదు. ఆయా గ్రామాల్లో ప్రజలు ముఖ్యంగా తల్లిదండ్రులను ఒప్పించే బాధ్యతను ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్‌కు ప్రభుత్వం అప్పగించింది. గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటుచేసి తల్లిదండ్రులను నచ్చజెప్పాలని సూచించింది. పిల్లల సంఖ్య మరీ తక్కువగా ఉంటే అక్కడ ఉన్న ఒకటి, రెండు తరగతులను సమీపంలోని పాఠశాలలకు పంపుతారని అటువంటప్పుడు గ్రామంలో శాటిలైట్ ఫౌండేషన్ స్కూలు ఉంటుందని చెప్పాలని సూచించింది. జీవో 117 అమలుతో ప్రాథమిక పాఠశాలల్లో పిల్లల సంఖ్య తగ్గిపోయింది. దీంతో కొన్నిచోట్ల పాఠశాలలు మూతపడ్డాయి. గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాలను మరోసారి చేస్తే గ్రామాల్లో ప్రాథమిక విద్య మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రతి గ్రామంలో ఒకటి నుంచి ఐదు తరగతులు కొనసాగే పాత విధానం అమలు చేయాలని కోరుతున్నారు. లేనిపక్షంలో శివారు ప్రాంతాల్లో పిల్లలు విద్యకు దూరమవుతారని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ప్రతిపాదనలు ఇవే...

... 5వ పేజీ తరువాయి

సంఖ్య ఆధారంగా టీచర్లను కేటాయిస్తారు. అంటే 20 నుంచి 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఇస్తారు.

4. ఆదర్శ పాఠశాలలు: ప్రతి పంచాయతీలో 60 మంది పిల్లలున్న ప్రాథమిక పాఠశాలను ఆదర్శ పాఠశాలగా ఎంపిక చేస్తారు. పీపీ-1, 2, ఒకటి నుంచి ఐదో తరగతి వరకు బోధన చేస్తారు. ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు ప్రతి తరగతికి ఒక టీచర్‌ను కేటాయిస్తారు. గత ప్రభుత్వంలో ఉన్నత పాఠశాలలకు పంపిన 3,4,5 తరగతులను వెనక్కి తీసుకువచ్చి ఆదర్శ పాఠశాలలో చేర్చుతారు.

5. ఉన్నత పాఠశాలలు: గత ప్రభుత్వంలో 3, 4, 5 తరగతులు ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. కొత్త విధానంలో ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి వరకు మాత్రమే ఉంటాయి. ప్రాథమికోన్నత పాఠశాలలకు వస్తే 30 మంది కంటే తక్కువగా ఉన్నవాటిని ప్రాథమిక పాఠశాలలుగా మార్చుతారు. ఆరు, ఏడు, ఎనిమిది తరగతులను మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో విలీనం చేస్తారు. మూడు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉన్నా, 60 మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులున్న యూపీ పాఠశాలలను హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేస్తారు.

అర్హులకు పింఛన్ల మంజూరులో జాప్యం

... 5వ పేజీ తరువాయి

వివరణ ఇస్తూ...ఉమ్మడి జిల్లాలో కొత్త పింఛన్లకు అర్హులతో జాబితాను తయారుచేసి ప్రభుత్వానికి పంపామన్నారు. ప్రభుత్వం మంజూరుచేసిన వెంటనే లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు. పక్కా ఇళ్ల కోసం పలువురు పేదలు ఎదురుచూస్తున్నారని కొందరు సభ్యులు చెప్పగా...ప్రస్తుతం నిర్వహిస్తున్న సర్వే పూర్తయిన తరువాత కొత్తగా లబ్ధిదారులను గుర్తిస్తామని గృహ నిర్మాణ సంస్థ అధికారులు వెల్లడించారు. ఇప్పటికే ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు బిల్లు డబ్బులను వెంటనే విడుదల చేయాలని చైర్‌పర్సన్ కోరారు.

కేజీహెచ్ మార్చురీలో పోస్టుమార్టంలో జాప్యం జరుగుతోందని చైర్‌పర్సన్ అనగా...సూపరింటెండెంట్ శివానంద స్పందిస్తూ...పోలీసులు శవపంచనామా చేసిన తరువాతే పోస్టుమార్టం చేయాలని, అందువల్ల ఆలస్యం అవుతున్నదని చెప్పారు. అయినప్పటికీ జాప్యం లేకుండా పోస్టుమార్టం పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు. కేజీహెచ్‌లో వైద్యం కోసం వచ్చే గిరిజనులకు విశ్రాంతి హాలు నిర్మించి అన్ని సదుపాయాలు కల్పించామని, గిరిజనులు దీనిని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఈ సమావేశాల్లో జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి ఇతర అధికారులు పాల్గొన్నారు. కాగా శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం ఉండడంతో పలు శాఖల అధికారులకు బదులు సిబ్బంది, ద్వితీయశ్రేణి అధికారులు సమావేశాలకు హాజరయ్యారు.

జీవనం భారమై, పిల్లలకు దూరమై...


... 5వ పేజీ తరువాయి

కన్నీటిపర్యంతమయ్యారు. మరికొందరు పిల్లలు...తల్లిదండ్రులకు ఒక ఆయాను ఏర్పాటుచేసి ఎప్పుడో ఒకసారి చుట్టం చూపుగా వచ్చి చూసి వెళుతున్నారు. ఇటువంటి వాళ్లు నగర పరిధిలోని అనేక ప్రాంతాల్లో ఉన్నారు. 'మా ఇంటికి వస్తే మీకే ఇబ్బందిగా ఉంటుంది...ఇక్కడే ఉండండి' అంటూ చెప్పి వెళ్లిపోతుంటారని హెచ్‌బీ కాలనీకి చెందిన 73 ఏళ్ల వృద్ధుడు పేర్కొన్నాడు.

బయటకు రాకూడదని..

వృద్ధాప్యంలో ఎంతోమంది తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. కానీ బయటకు రానివ్వరు. పిల్లల పరువు పోకూడదన్న ఉద్దేశంతో వృద్ధాశ్రమాల్లో చేరుతున్నవాళ్లు కూడా వారి కుటుంబ సభ్యులు విషయాలను బయటకు చెప్పేందుకు ఇష్టపడరు. తప్పనిసరి పరిస్థితుల్లో చెప్పాల్సి వచ్చినా.. వారి గురించి ఎవరికీ చెప్పవద్దని కోరుతుంటారు. తమ వల్ల పిల్లలకు చెడ్డపేరు రాకూడదని కోరుకుంటుంటారు.

పిల్లలు చేరదీయకపోవడంతో మానసిక వేదన



వృద్ధాప్యంలో పిల్లలు దూరంగా పెట్టడం వల్ల తీవ్ర మానసిక వేదనను అనుభవిస్తుంటారు. కష్టపడి చదివించి, ప్రయోజకులను చేస్తే ఇప్పుడు పట్టించుకోవడంలేదని బాధపడుతుంటారు. మానసికంగా కుంగిపోతున్నామని, నిద్ర పట్టడం లేదంటూ నెలకు ముగ్గురు, నలుగురు వస్తుంటారు. తాము ఒంటరి అయిపోయామన్న బాధ, భావన వారిలో ఉంటోంది. ఆ బాధ తగ్గేందుకు కౌన్సెలింగ్ ఇస్తుంటాం. పిల్లలు తమకు దగ్గరిలో ఉన్నా పట్టించుకోరని కొందరు వాపోతుంటారు. పిల్లల ప్రేమ పూర్వకమైన మాట వారిని మానసిక సమస్యలు, నిద్ర లేమి ఇబ్బందుల నుంచి బయటపడేలా చేస్తుంది. కానీ, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు పడుతున్న బాధలు పిల్లలకు పట్టడం లేదు. కనీసం వారి గురించి ఆలోచించే తీరిక కూడా ఉండడం లేదు. కొందరు తల్లిదండ్రులకు కావాల్సిన డబ్బులు, సౌకర్యాలు కల్పిస్తున్నారు. కానీ, అవి వారికి మానసిక ఆనందాన్ని కలిగించేందుకు దోహదం చేయడం లేదు. అన్నీ ఉన్నా కుటుంబం లేదన్న భావన ఆ వయసులో వారిని తీవ్రంగా వేధిస్తుంది. -డాక్టర్ ముత్యాల బాలాజీ, సైకాలజిస్ట్



కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడికి వినతిపత్రం అందజేస్తున్న ఐలా ప్రతినిధులు

కేంద్ర మంత్రిని కలిసిన ఐలా ప్రతినిధులు

ఆటోనగర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్‌లో నూతన రహదారుల నిర్మాణం, ఆర్‌వోబీని త్వరితగతిన పూర్తి చేయాల్సిన ఆవశ్యకతలపై కేంద్ర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు ఐలా ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో కేంద్ర మంత్రిని ఐలా కమిటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, సెక్రటరీ చీకటి సత్యనారాయణలు కలిశారు. ఆటోనగర్‌లో ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్టు ఐలా ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త వెంకయ్యచౌదరి పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

అగనంపూడి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజాపిత ఈశ్వరీయ విశ్వ విద్యాలయం బ్రహ్మకుమారీస్ సంస్థ స్థానిక శాఖ ఆధ్వర్యంలో బీసీ కాలనీలో గల దివ్యజ్యోతి భవనం వద్ద వేద్ నేత్రాలయ ఐకేర్ ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు సంస్థ ప్రతినిధి రామకోటి తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు శిబిరం కొనసాగుతుందని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

ఆరుగురు కబ్జాదారులపై కేసు

కూర్మన్నపాలెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి స్థలాలను కబ్జా చేసిన ఆరుగురిపై దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెదగంట్యాడ సమీపం దిబ్బపాలేనికి చెందిన నాగల్ల గీతామణి, కారి నాగమ్మలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే 87వ వార్డు పరిధి వడ్లపూడిలో ఆర్-కార్డు హోల్డర్ పల్లేటి పోలయ్యకు చెందిన ప్లాట్ నంబర్-1295, కర్రి నాగమ్మకు చెందిన ప్లాట్ నంబర్-1294లకు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి కబ్జాదారులు వేరొకరికి విక్రయించారంటూ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. లోకేశ్ ఆదేశాల మేరకు సీపీ ఆధ్వర్యంలో దువ్వాడ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. పోలీసుల విచారణలో లీగల్ హెయిర్ సర్టిఫికెట్, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించిన చేకూరి రామచంద్రరాజు, ఈగల లక్ష్మి, పరశురామ్, ఈగల హేమగోపాల్, వెంకటనరసమ్మ, కొల్లా మాణిక్యంపై దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

- **కోర్ట్ :** సంగం, శ్రీ వెంకటేశ్వర-1, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి),
- **దిల్‌రుబా :** జగదాంబ, శ్రీకన్య, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **శబ్దం :** సంగం, శారద, కిన్నెర,
- **మజాకా :** రమాదేవి, శ్రీరామా, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం),
- **డ్రాగన్ :** జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, కామేశ్వరి, కన్యకాంప్లెక్స్, మోహినికాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 40, పచ్చిమిర్చి 28, కాకరకాయలు 42, బీరకాయలు 54, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 27 దొండకాయలు 38, బంగాళదుంపలు 16, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 50, అల్లం (పాతది)50, బరబాటి 38, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 48, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 52, కీరదోస 26, క్యాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడ దుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	400
విజయనగరం	404
శ్రీకాకుళం	404

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	70
లైవ్ ధర	90
విత్ స్కిన్	150
స్కిన్‌లెస్	160



గాజువాక ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు



గోపాలపట్నం రైతు బజారు పరిసరాలను చీపుర్లతో శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు, తదితరులు



పెందుర్తిలో విద్యార్థులు, అధికారులతో స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ కృషి చేయాలి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు
- ప్లాస్టిక్ రహితంగా నగరాన్ని తీర్చిదిద్దాలి: ఎమ్మెల్యే గణబాబు
- 12 అంశాలతో స్వచ్ఛ దివస్: ఎమ్మెల్యే పంచకర్ల
- పలుచోట్ల 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్' నిర్వహణ

గాజువాక, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రగతి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రగతిలో ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అనారోగ్యాలు దరిచేరవని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ ముర్తజా, ఎండీ రఫీ, గోమాడ వాసు, నాయకులు పాల్గొన్నారు. అలాగే న్యూఐటీఐలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు, ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్ రైతుబజారులో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి పి.చినబాబు, తదితరులు పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు.

గోపాలపట్నం: ప్లాస్టిక్ రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇక్కడి రైతుబజారులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ నగరాల చెంత మహా విశాఖ నగరాన్ని చేర్చడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. బజారులోని రైతులతో స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం స్వచ్ఛత ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో గోపాలపట్నం తహశీల్దార్ సీహెచ్‌వీ రమేశ్, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్, ఏఎంహెచ్‌వో బి.అప్పలనాయుడు, రైతుబజారు ఈవో జి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి: పన్నెండు నెలలు పన్నెండు అంశాలతో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. మండల పరిషత్‌లోని గాంధీ విగ్రహం వద్ద పాఠశాల విద్యార్థులు, అధికారులతో కలిసి ఆయన స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎనిమిదో జోన్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధ కార్యక్రమంలో మాట్లాడుతూ అందరూ పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించాలన్నారు. రైతుబజార్ వద్ద జరిగిన కార్యక్రమంలో కూరగాయాల కొనుగోలు, విక్రయదారులందరూ నారసంచులను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, జెడ్పీ హేమావతి, కూటమి నాయకులు అయిత సింహాచలం, గొర్లె రామునాయుడు, సోమశేఖర్, కరక దేవుడు, గొర్లె అప్పారావు, ఆర్‌ఎస్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు. అలాగే పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో సీఐ కేవీ సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఠాణా ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. 97వ వార్డు సుజాతనగర్ సమీపంలోని కార్మికనగర్‌లో జరిగిన స్వచ్ఛ దివస్‌లో కార్పొరేటర్ సేనాపతి వసంత, రాంపురంలో మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు కార్యక్రమాలను చేపట్టారు.



ఆటోనగర్‌లో ర్యాలీలో పాల్గొన్న ఐలా కమిషనర్ కిశోర్, తదితరులు



ఈఎస్‌ఐ ఆస్పత్రి పరిసరాలను చీపుర్లతో శుభ్రం చేస్తున్న సూపరింటెండెంట్ రమణమూర్తి, కార్పొరేటర్ నాగేశ్వరరావు తదితరులు

పెదగంట్యాడ: స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్‌లో అందరూ భాగస్వాములు కావాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. నెల్లిముక్కు రామాలయం ఆవరణలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతలో విశాఖ ప్రథమ స్థానంలో ఉందని, దీనిని అలాగే కొనసాగించాలన్నారు. జోనల్ కమిషనర్ బీఆర్‌ఎస్ శేషాద్రి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్‌ను నిత్యం కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పులి లక్ష్మీబాయి, రౌతు శ్రీనివాసరావు, ఏఎంహెచ్‌వో కిరణ్, ప్రజారోగ్యశాఖ సీనియర్ సూపర్‌వైజర్ రామారావు, నాయకులు పులి వెంకటరమణారెడ్డి, పి.సోమునాయుడు, అప్పారావు, పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్: స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్ ర్యాలీని ఆటోనగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలా కమిషనర్ కె.కిశోర్ మాట్లాడుతూ అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వాసీవా, ఏపీఐఐసీ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఐలా మాజీ చైర్మన్ యార్లగడ్డ సాంబశివరావు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో ఐలా కమిటీ సభ్యులు, వాసీవా సభ్యులు రామ్‌ప్రసాద్, పరుచూరి ప్రభాకర్, ఈ.కృష్ణప్రసాద్, నాగిరెడ్డి, నాయుడు, సన్యాసిరావు, అంబిక తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: ప్రజలందరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర అవగాహన కార్యక్రమంపై వైద్యులు, రోగులు, సిబ్బందిచే ఆమె ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యులు ఉష, లలిత, గోపికృష్ణ, జాన్సన్ ప్రత్యూష, ఏవో రవిరాజ్, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: పర్యావరణానికి ముప్పుగా మారిన నిషేధిత ప్లాస్టిక్ వాడకానికి అందరూ దూరంగా ఉండడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని 69 వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా స్థానికులకు క్లాత్ సంచులను పంపిణీ చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ అమర్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు. అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ హెచ్‌ఎం ఎంఎల్‌ఎస్ కాంతం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో శ్రీహరిపురంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్ ర్యాలీని చేపట్టారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి, టీడీపీ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, యూనిట్ ఇన్‌చార్జి గొందేశి రాజేశ్, బూత్ కన్వీనర్ శివారెడ్డి, నాని, తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ 61వ వార్డు అధ్యక్షుడు మజ్జి సోమేశ్ ఆధ్వర్యంలో మల్కాపురం మార్కెట్‌లో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురికి క్లాత్ సంచులను పంపిణీ చేశారు. నాయకులు పైడిరాజు, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు. విశాఖపట్నం లారీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ఎంవీ ఇన్‌స్పెక్టర్ బాలాజీరావు, మాధవి, అసోసియేషన్ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, కె.అర్జునరావు, కె.కాశీవిశ్వనాథ్‌ తదితరులు పాల్గొన్నారు.

సింధియా: పర్యావరణానికి హానికరమైన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి అందరూ స్వస్తి పలకాలని ఈఎస్‌ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణమూర్తి కోరారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా న్యూకాలనీలోని ఈఎస్‌ఐ ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటడంతో పాటు పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని ఏరివేసి పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, ఆర్‌ఎంవో డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ సునీత, డాక్టర్ ఫణీంద్ర, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి-రూరల్: గ్రేటర్ 95వ వార్డు పరిధి పాపయ్యరాజుపాలెంలోని పరిసర ప్రాంతాలను కార్పొరేటర్ ముమ్మన దేముడు, పలువురు అధికారులు, సిబ్బంది చీపుర్లు చేతబట్టి శుభ్రంగా తీర్చిదిద్దారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని అందరూ నిషేధించాలని కార్పొరేటర్ కోరారు. స్థానిక నాయకులు రోమాల నూకరాజు, కె.శ్రీను, రామునాయుడు, సంతోశ్, కేవీఆర్ లక్ష్మి, భవానీ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: 90వ వార్డు బుచ్చిరాజుపాలెం తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ బొమ్మిడి రమణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ నిషేధిత ప్లాస్టిక్ వాడకాన్ని విడనాడాలన్నారు. తహశీల్దార్ సీహెచ్‌వీ రమేశ్, వీఆర్వో సుబ్రమణ్యం, శానిటరి ఇన్‌స్పెక్టర్, డ్వాక్రా గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

వేపగుంట: వేపగుంట హైస్కూల్‌లో చేపట్టిన కార్యక్రమంలో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు పాల్గొని మొక్కలు నాటారు. మొక్కల పెంపకం, పర్యావరణ సమతుల్యానికి విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శానిటరీ సూపర్‌వైజర్ ఎస్వీ రమణ, నాయకులు పిన్నింటి పార్వతి, కిరణ్ పాల్గొన్నారు. చీమలాపల్లి డంపింగ్ యార్డులో జరిగిన కార్యక్రమంలో ఏఎమ్‌హెచ్‌వో బి.అప్పలనాయుడు మొక్కలు నాటారు. యార్డు ఇన్‌చార్జి లాజరస్, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.



భూగర్భ విద్యుత్ లైన్ల పనుల ప్రారంభం సందర్భంగా పూజ చేస్తున్న పల్లా శ్రీనివాసరావు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా

అక్కిరెడ్డిపాలెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా సంక్షేమంతో పాటు అన్ని రంగాలను అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక నియోజకవర్గంలో చేపట్టనున్న భూగర్భ విద్యుత్ లైన్ల పనులకు శనివారం తుంగ్లాం కాలనీలో ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోస్టల్ ప్రాంతంలో బయటకు విద్యుత్ తీగలు కనిపించకుండా భూగర్భ లైన్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకుందన్నారు. ఈ క్రమంలో గాజువాకలో తొలి విడతగా సుమారు రూ.80 కోట్ల వ్యయంతో 33కేవీ 76 కిలోమీటర్లు, 11కేవీ 123 కిలోమీటర్ల భూగర్భ విద్యుత్ లైన్లను వేస్తున్నామన్నారు. ఈ అభివృద్ధి పనులకు ప్రజలంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ జి.శ్యాంబాబు, ఈఈ బీకే నాయుడు, డి.వేణుగోపాల్, ఏఈ తారకేశ్, టీడీపీ నాయకులు అలమండ రాజు, ఎ.శ్రీను, కె.ముత్యాలనాయుడు, జి.గోపి, ఎస్.చినసన్యాసిరావు, పి.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలే ఉపాధి కారాదు

నాయకులు సమస్యలపై పోరాడాలే తప్పా పోరాటాలనే ఉపాధిగా చేసుకోరాదని పల్లా శ్రీనివాసరావు హితవు పలికారు. మరికొద్ది నెలల్లో మూసివేస్తారనుకున్న స్టీల్‌ప్లాంటుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు కేంద్రంతో చర్చించి రూ.11,200 కోట్ల ఆర్థిక ప్యాకేజీకి ప్లాంటుకు వచ్చేలా చేశారన్నారు. దీనిని కొంతమంది నాయకులు గుర్తించకుండా ఇంకా ఉద్యమాలు చేస్తుండడం బాధాకరమన్నారు.

బుద్ధిమాంద్యం విద్యార్థి మనోవేదన

- పదో తరగతి పరీక్షలు రాసేందుకు స్క్రైబ్‌కు అనుమతివ్వాలని లేఖ రాసిన పాఠశాల హెచ్‌ఎం
- ఐక్యూ లెవెల్స్ బాగున్నందున సర్టిఫికెట్ మంజూరు చేయని వైద్యుడు
- విద్యాశాఖ అధికారులు స్పందించాలని పలువురు వేడుకోలు



విద్యార్థి గోవింద్

మల్కాపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మరో 24 గంటల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో బుద్ధిమాంద్యం గల ఓ విద్యార్థి తీవ్ర మనో వేదనకు గురవుతున్నాడు. మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో బుద్ధిమాంద్యం గల వడ్డాది గోవింద్ పదో తరగతి చదువుతున్నాడు. టెన్త్ పరీక్షలను స్క్రైబ్‌తో రాయించవచ్చని తల్లిదండ్రులు ఆశించారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ వైద్యుడు అంగవైకల్యానికి చెందిన సర్టిఫికెట్ మంజూరు చేయాల్సి ఉంది. అయితే గోవింద్ ఐక్యూ లెవెల్స్ బాగున్నందున వైద్యుడు ఆ సర్టిఫికెట్ ఇవ్వలేదు. వాస్తవానికి ఆ విద్యార్థి ఏ వస్తువును సరిగా పట్టుకోలేడు. పెన్ను పట్టుకున్నా చెయ్యి వణికిపోతుంది. ఈ విషయాన్ని పాఠశాల హెచ్‌ఎం అరుణ లేఖ ద్వారా వైద్యునికి తెలిపారు. అయినప్పటికీ విద్యార్థి ఐక్యూ లెవెల్స్ సక్రమంగా ఉన్నందున అంగవైకల్యానికి సంబంధించి పర్సంటేజ్‌ను ఇవ్వలేమని తేల్చిచెప్పడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. డాక్టర్ సర్టిఫికెట్ ఉంటేనే సదరు విద్యార్థికి విద్యాశాఖ అధికారులు స్క్రైబ్ సేవలను అందిస్తారు. అందువల్ల విద్యాశాఖ అధికారులు స్పందించి గోవింద్ స్క్రైబ్ ద్వారా పరీక్షలు రాసేందుకు అనుమతివ్వాలని తల్లిదండ్రులతో పాటు పలువురు కోరుతున్నారు.

అవార్డు గ్రహీతలకు అభినందనలు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పతకాలు సాధించిన ట్రాఫిక్ విభాగం ఉద్యోగులను ట్రాఫిక్ విభాగాధిపతి విజయ్‌కుమార్ విభాగంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంటులో భద్రత చాలా ముఖ్యమన్నారు. విధి నిర్వహణలో ఉద్యోగులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యోగులు రాజు, పవన్‌కుమార్, రవికుమార్, నాయుడు, రమేశ్, ఎం.రాము, ఈశ్వరరావు, తారక్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

పెందుర్తి-రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలఅగ్రహారం గవరపాలెంలో శ్రీగీతాకృష్ణ ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త తాతారావు ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.

ఉక్కు టౌన్‌షిప్‌లో నాగుపాము హల్‌చల్



పాముతో స్నేక్ క్యాచర్ కిరణ్

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్-11లోని 111 క్వార్టర్స్‌లో ఓ నాముపాము హల్‌చల్ చేసింది. క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న స్టీల్‌ప్లాంట్ అధికారి లింగాల రవీంద్రబాబు ఇంటి ఆవరణలో శని వారం మధ్యాహ్నం సుమారు ఏడు అడుగుల పాము కనిపించింది. దీంతో ఆ ఇంట్లో వారంతా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. తక్షణమే స్నేక్ క్యాచర్ రొక్కం కిరణ్‌కుమార్‌కు సమాచారం అందించారు. ఆయన వచ్చి ఎంతో చాకచక్యంగా పామును పట్టుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వంతెన నిర్మాణ స్థలాలను పరిశీలించిన ఎమ్మెల్యే

ఎన్.ఎ.డి.జంక్షన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎన్ఏడీ కొత్తరోడ్డు ఫ్లైవోవర్ నుంచి కాకానీనగర్ జంక్షన్ వరకు నూతనంగా నిర్మించనున్న ఆర్వోబీ, ఆర్‌యూబీల నిర్మాణాలపై వీఎంఆర్డీఏ, రెవెన్యూ, తదితర విభాగాల అధికారులతో కలిసి శనివారం ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఎన్ఏడీ ఫ్లైవోవర్ వద్ద ఆర్వోబీ వంతెన నిర్మాణంపై వీఎంఆర్డీ అధికారులుతో చర్చించారు. అలాగే కాకానీనగర్ జంక్షన్‌లో ఆర్‌యూబీ నిర్మాణానికి సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ గాజువాక నుంచి, విమానాశ్రయం నుంచి వచ్చే వాహనాలు నేరుగా నగరంలోకి వెళ్లేలా అధికారులు చర్యలు చేపడితే భవిష్యత్తులో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తవని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సీహెచ్‌వీ రమేశ్, కార్పొరేటర్ బొమ్మిడి రమణ, తదిరతులు పాల్గొన్నారు.

వెంకటాద్రిపై పదో తరగతి విద్యార్థుల పూజలు



హాల్ టికెట్లకు పూజలు చేస్తున్న అర్చకుడు

పెందుర్తి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు శనివారం పెద్దసంఖ్యలో పెందుర్తిలోని వెంకటాద్రి శిఖరంపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. శ్రీవారి పాదాల చెంత హాల్ టికెట్లు, పెన్నులు పెట్టారు. ప్రధాన అర్చకుడు రామానాజుచార్యులు వాటికి పూజలు చేసి విద్యార్థులను ఆశీర్వదించారు.

భూ కబ్జాలు, దందాలను సహించను: ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పెందుర్తిలో ప్రభుత్వ భూముల కబ్జాలు, సెటిల్‌మెంట్ దందాలను సహించనని, ఈ క్రమంలో ఎవరైనా తన పేరు వాడినా, ఫ్లెక్సీని వినియోగించినా ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు స్పష్టం చేశారు. సుజాతనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన జీవితం తెల్లకాగితం వంటిందని, తనకు గానీ రక్త సంబంధీకులకు కానీ భూ ల్యాండ్ వ్యవహారాల్లో ఎటువంటి సంబంధాలు లేవన్నారు. సుజాతనగర్‌లోని టీచర్స్ లేఅవుట్ భూ వివాదంలో ఓ పోలీసు అధికారి బంధువుల పాత్ర ఉందని, దీనిపై విచారణ జరపాలని అధికారులను ఆదేశించామన్నారు. అలాగే పెందుర్తిలోని ఆక్రమణలపై సర్వే నంబర్లతో పాటు కలెక్టర్‌కు లేఖల ద్వారా తెలిపామని పేర్కొన్నారు. కబ్జాలకు కళ్లెం వేయడమే తన లక్ష్యమని, ఇందులో తమ వర్గానికి చెందినవారి ప్రమేయం ఉన్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో కూటమి నాయకులు అయిత సింహాచలం, సేనాపతి సోమశేఖర్, గొర్లె అప్పారావు, గొర్లె రామునాయుడు, బిహరగోపాల్, నాయుడు, డీబీఎల్ నాయుడు పాల్గొన్నారు. అనంతరం జరిగిన ప్రజా దర్బార్‌లో సమస్యలపై వినతులను పంచకర్ల స్వీకరించారు.

ఇఫ్తార్ విందులో గణబాబు

మల్కాపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యాలకు విశాఖ వేదికంగా ఉంటుందని, ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతంలో అన్ని మతాల వారు సోదరభావంతో ఉంటారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీజీవీఆర్ పి.గణబాబు అన్నారు. శ్రీహరిపురం మసీద్‌లో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏటా మాదిరిగానే ముస్లిం సోదరులు తనను ఆహ్వానించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అర్హులైన ముసింలందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలతో పాటు వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రామ్మోహన్ నాయుడు, టీడీపీ నాయకులు మాతా శ్రీను, కోరాడ శ్రీనివాసరావు, పి.శ్రీను, జిలానీ, నాయుడు, నీలాపు జోగి, తదితరులు పాల్గొన్నారు.



స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, మేయర్ హరి వెంకటకుమారి తదితరులు

విశాఖను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలి

- నిషేధిత ప్లాస్టిక్‌కు బదులుగా ఇతర ప్రత్యామ్నాయాలను వినియోగించాలి
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ హరేంధిర ప్రసాద్

బీచ్ రోడ్డు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆర్కే బీచ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు స్వచ్ఛందంగా సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి జిల్లాలో ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తున్నామని, అయితే ప్రజలు సంపూర్ణ సహకారం లేకపోవడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదన్నారు. ముఖ్యంగా.. ప్రజలు, వర్తకులు ప్లాస్టిక్ వస్తువులను ప్రోత్సహించరాదని, దానికి బదులు వస్త్రంతో తయారు చేసిన సంచులు ఇతర ప్రత్యామ్నాయాలను వినియోగించాలన్నారు. స్వచ్ఛమైన గాలి, వాతావరణం ఉండాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, అప్పుడే సమాజం బాగుపడుతుందన్నారు. మైక్రో ప్లాస్టిక్ వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని, రాష్ట్ర ప్రభుత్వ నిర్దేశ ఆశయం మేరకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వచ్చే జూన్ 1వ తేదీ నుంచి జిల్లాలో ప్లాస్టిక్ వస్తువుల క్రయ, విక్రయాలు, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, దాడులు నిర్వహించి అమ్మే వారిపై జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగానికి పూర్తిగా స్వస్తి పలుకుతామని చెప్పారు. నగర మేయర్ హరి వెంకటకుమారి మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసుకొన్నప్పుడు ప్లాస్టిక్ సంచుల్లో వేడివేడి వస్తువులను క్యాన్సర్ రావడానికి అవకాశం ఉందని, వీటికి ప్రజలు దూరంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం, సంక్షేమం దృష్ట్యా ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందని, అందులో భాగమే 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' అని పేర్కొన్నారు. ప్లాస్టిక్‌ను సమూలంగా నిర్మూలించేందుకు, సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించేందుకు ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావాలను చూపే ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉందామని పూర్తిగా స్వస్తి పలుకుతామని, స్వచ్ఛ విశాఖ సాధనకు అందరూ కలిసికట్టుగా నడుద్దామని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ సంచులు ఉపయోగించడం వల్ల పర్యావరణపరంగా అనేక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. పాలిథిన్ బ్యాగులు వాడి ఎక్కడికక్కడ పడేయడంతో కాలువలు మూసుకుపోవడం, భూగర్భ జలాల కాలుష్యం మొదలైన వాటితో పాటు విచక్షణారహితంగా ఉపయోగించే రసాయనాల వల్ల అనర్థాలు ఉన్నాయన్నారు. అనంతరం జీవీఎంసీ ఆధ్వర్యంలో వంద అడుగుల వస్త్రంతో రూపొందించిన బ్యానర్ చేతపట్టి ర్యాలీగా మహిళలు, యువతీయువకులు ముందుకు సాగారు. 'ప్లాస్టిక్ వద్దు.. గుడ్డ సంచులే ముద్దు' అంటూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో అందరి చేత ప్రత్యేక అధికారి కాటమనేని భాస్కర్ స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు సోమన్నారాయణ, వర్మ, రమణమూర్తి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేష్, వివిధ జోనల్ కమిషనర్లు, జిల్లా స్థాయి అధికారులు, కాలుష్య నియంత్రణ, పరిశ్రమల శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువతీ యువకులు, పలు సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు





పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చంద్రబాబు దంపతులు, బీఆర్ నాయుడు

అమరావతిలో.. శ్రీవారి కల్యాణోత్సవం

రాజధాని అమరావతి వెంకటపాలెంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రప్రథమంగా శనివారం శ్రీవారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడి కల్యాణాన్ని తిలకించిన భక్తజన సందోహం పరవశించింది. విద్యుత్ వెలుగులతో కల్యాణ ప్రాంగణం కాంతులీనగా భక్తుల జయజయధ్వానాల మధ్య కన్నుల పండువగా జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు, గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరుల సమక్షంలో టీటీడీ వేద పండితులు స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులను భాగస్వాములను చేస్తూ కైంకర్యాలను నిర్వహించారు.

-తుళ్లూరు, ఆంధ్రజ్యోతి



వెంకటపాలెంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు దంపతులు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తదితరులు



శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న సీఎం చంద్రబాబు దంపతులు



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



చంద్రబాబుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న బీఆర్ నాయుడు



సీఎం చంద్రబాబుకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు

ఉక్కుకు సొంత గనులు కేటాయిస్తేనే ప్రగతి

- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

కూర్మన్నపాలెం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయిస్తే ప్రగతిపథంలో పయనిస్తుందని, అంతేగానీ కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ పేరుతో కార్మికులను మోసం చేస్తే ప్రగతి సాధించినట్టు కాదని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయబోమని పార్లమెంటులో ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్యాకేజీలు బ్యాంకుల బకాయిలకే సరిపోతుందని విమర్శించారు. ఉక్కు ఉద్యోగులకు ఆరు నెలలు వేతనాల బకాయిలు, స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులు తేలేకపోతుందన్నారు. ఉక్కు కర్మాగారాన్ని కార్పొరేట్ల చేతుల్లో పెట్టడానికే ఇప్పటివరకు సొంత గనులను కేటాయించలేదన్నారు. విద్యుత్ కొనుగోళ్లకు సంబంధించి జగన్ హయాంలోని అక్రమాలపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గగ్గోలు పెట్టిన చంద్రబాబు ఇప్పుడు అదానీపై ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జనసేన ఆవిర్భావ సభలో చేసిన వ్యాఖ్యలను తాము ఖండిస్తున్నామన్నారు. పవన్‌కల్యాణ్ పుట్టకముందు నుంచే ప్రజా సమస్యలపై వామపక్షాలు పోరాటాలు చేస్తున్నాయన్నారు. అనంతరం 'విశాఖ ఉక్కుకు ఊతమివ్వని ప్యాకేజీ' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, రమణమూర్తి, యు.రామస్వామి, కేఎస్ఎన్ రావు, వరసాల శ్రీనివాసరావు, రామచంద్రరావు, సీపీఎం నాయకులు లోకనాథం, ఎం.జగ్గునాయుడు, ఎన్.రామారావు, కేఎస్ఎన్ రావు, వైటీ దాస్, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న బీవీ రాఘవులు, తదితరులు

దేశాభివృద్ధికి నూతన ఆవిష్కరణలు ఎంతో కీలకం

- సహజ మేధతో కృత్రిమ మేధ మనుగడ సాధ్యం
- ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ అధిపతి ప్రొఫెసర్ దయాసాగర్

విశాఖపట్నం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధికి నూతన ఆవిష్కరణలు ఎంతో కీలకమని ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ బెంగళూరు అధిపతి ప్రొఫెసర్ బీఎస్ దయాసాగర్ అన్నారు. ఆంధ్ర యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సహజ మానవ మేధాతోనే కృత్రిమ మేధ మనుగడ సాధ్యపడుతుందన్నారు. విదేశాలకు మేధో వలసలు వెళ్లే వారి సంఖ్య భవిష్యతులో గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు. దేశంలో పరిశోధనలు చేసి ఇక్కడే స్థిరపడిన వారి సంఖ్య మెరుగుపడుతుందని, ఇందుకు దేశ ఆర్థిక ప్రగతి కూడా కారణమన్నారు. క్వాంటిఫికేషన్ నుంచి ఇన్నోవేషన్ వస్తాయని, అందువల్ల క్వాంటిటేటివ్ సైన్స్‌పై విద్యార్థులు దృష్టి పెట్టాలని సూచించారు. తాను ఏయులో చదువుకునే సమయంలో సాధారణ విద్యార్థిగా ఉండేవాడినని, భారతీయ శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యం చంద్రశేఖర్ జీవిత చరిత్రను చదివాక తన జీవితంలో ఎంతో మార్పు వచ్చిందన్నారు. ఏయూ భౌతికశాస్త్ర విభాగంతో సర్ సీవీ రామన్‌కు ఉన్న అనుబంధాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం మ్యాథమెటికల్ మార్ఫోలజీ ఫ్రాక్టల్ జామెంట్రీ అంశాలపై మాట్లాడారు.

ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆసక్తిని, అభిరుచిని తెలుసుకునే ప్రయత్నం చేయాలన్నారు. మార్కుల కంటే శాస్త్ర జ్ఞానాన్ని మనలో ఎంత ఎక్కువగా నిక్షిప్తం చేసుకున్నామన్న దానికే ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జాతీయ విద్యా విధానం ప్రాంతీయ భాషల్లో బోధనను ప్రోత్సహిస్తుందని, దీనిని తాము కూడా త్వరలో అందిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశ్నించడాన్ని అలవాటు చేసుకోవాలని, దీనినుంచి ఆవిష్కరణలు సాకారమవుతాయన్నారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు మాట్లాడుతూ వికసిత్ భారత్ సాకారం కావడానికి సైన్స్ దోహదపడుతుందన్నారు. అభివృద్ధికి పునాది రాయిగా సైన్స్ నిలుస్తుందన్నారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. సైన్స్ పట్ల ప్రజల్లో అవగాహన కలిగించేలా విద్యార్థులతో భారీ ర్యాలీని చేపట్టారు.



ర్యాలీలో పాల్గొన్న ప్రొఫెసర్ దయాసాగర్, వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్, తదితరులు

భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయండి: కలెక్టర్

మహారాణిపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. రైల్వే, హెచ్‌పీసీఎల్, ఇరిగేషన్, విద్యుత్, ఐవోసీఎల్, జాతీయ, అంతర్గత రహదారులు తదితర ప్రాజెక్టులపై జేసీ, డీఆర్వోలతో కలిసి శనివారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. నిర్ణీత గడువులోగా భూములను సేక రించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం... crime news

బాలికపై అత్యాచారయత్నం

గాజువాక, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తిని స్థానికులు పట్టుకుని గాజువాక పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాత గాజువాకలోని ఓ ప్రాంతానికి చెందిన బాలిక ఇంటికి అదే ప్రాంతానికి చెందిన కూరగాయలు అమ్ముకునే ఓ వ్యక్తి (45) శనివారం ఉదయం సుత్తి కోసం వచ్చాడు. సుత్తి తీసుకున్న తరువాత ఆ వ్యక్తి అక్కడ నుంచి వెళ్లకుండా ఇంటి తలుపు గడియ పెట్టి బాలికపై అసభ్యంగా ప్రవర్తించబోయాడు. బాలిక పెద్దగా కేకలు వేస్తూ తలుపులు తీసుకుని బయటకు పరుగులు తీసింది. దీంతో స్థానికులు ఆ వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఆ తరువాత ఇంటికి వచ్చిన బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్య

ఎంవీపీ కాలనీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలోని నక్కవానిపాలెం రామాలయం వీధిలో ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. పదో తరగతి చదువుతున్న బాలిక మరో బాలుడితో సాన్నిహిత్యంగా ఉన్నట్టు తెలిసిన తల్లి బాలికను శుక్రవారం రాత్రి మందలించింది. దీంతో బాలిక వెంటనే గదిలోకి వెళ్లి తలుపులు గడియపెట్టుకుంది. ఎంత చెప్పిన తీయలేదు. కొంత సేపటి తర్వాత తలుపులు బద్దలు కొట్టి చూసేసరికి ఫ్యానుకు ఉరి వేసుకుని ఉంది. 108 సిబ్బంది వచ్చి తనిఖీ చేసి, అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేశారు. సీఐ జె.మురళీ దర్యాప్తు చేస్తున్నారు.



హనుమంతవాక సమీపంలో బోల్తా పడిన కారు. (ఇన్‌సెట్లో) ప్రమాదానికి కారణమైన టిప్పర్

టిప్పర్ ఢీకొని కారు బోల్తా

ఎంవీపీ కాలనీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై శనివారం ఉదయం హనుమంతవాక జంక్షన్ సమీపంలో అపరిమిత వేగంతో వెళుతున్న ఓ లారీ ఢీకొనడంతో కారు బోల్తాపడింది. అదృష్టవశాత్తూ కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 'ఆంధ్రజ్యోతి' బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు కుటుంబంతో ఎండాడలో నివాసం ఉంటున్నారు. శనివారం ఉదయం కుటుంబంతో కారులో నగరంలోకి వెళుతుండగా, హనుమంతువాక సిగ్నల్ దాటిన తర్వాత వెనుక నుంచి టిప్పర్ బలంగా ఢీకొంది. దీంతో కారు బోల్తా పడింది. కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి దారితీసింది. ప్రమాదం కారణంగా దాదాపు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఎస్ఐ శ్రీకాంత్, ఎంవీపీ ఎస్ఐ ధనుంజయనాయుడు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. నగరంలోకి పగటిపూట లారీల రాక వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయమై పోలీసులు దృష్టిసారించాల్సి ఉంది.